
# బాల



## పిల్లల బొమ్మల పత్రిక

Vol. 2 BALA 6




అన్ని నొప్పులనూ పోగొట్టే

అందాల బాల

# అమృతాంజనము

పసిపాపల
పాలిటి
శ్రీరామరక్ష



## మెక్లెక్
# గ్రైప్‌కాల్




పసిపాపలకు సాధారణంగా కలిగే అజీర్తి, మందమూ మొదలగు వాటికి అమోఘమైనది. శిశువులకు హితకరమైనది.

పెరిగే పిల్లలకు పుష్టి నొసగే
మెక్లెక్ ఆహారము

- చిల్డ్రన్స్ ఫుడ్
- సిరప్ కాల్విటాల్




కెమిస్టు లందరియొద్దగాని,
మా యొద్దగాని దొరకును.


Meclec

ది మెక్లెక్ న్యూట్రిమెంట్స్
అండ్ ఫార్మక్యూటికల్స్, లి.
99-ఎ. ఆర్మీనియన్ వీధి, మద్రాసు 1.

# నాణ్యము — ధరలు

బట్టల వ్యాపారములో నాణ్యము - ధరలు ఈరెండూ
ముఖ్యముగా గమనింపవలసిన విషయములు,

మంచి నాణ్యము, సరసమైన ధరలూ కావాలంటే చేనేత బట్టలనే కొనవలెను,



మాచే **తయారుచేయబడు** చీరెలు, ధోవతులు, తువాళ్లు, షర్టింగులు
**మొదలగు** వాటిపై ముద్రింపబడిన సరసమైన కంట్రోలు ధరలకు
మీరు కొనినచో **మా బట్టల** నాణ్యము మీకే తెలియును.

మదరాసులోను, అన్ని జిల్లాలలోనూ వుండే
మా విక్రయశాలలలో దొరకును.

## మద్రాసు హ్యాండ్‌లూమ్ వీవర్స్
## ప్రొవిన్షియల్ కోఆపరేటివ్ సొసైటీ లి.

**నెం. 6-ఎ. వుడ్సురోడ్ - మౌంటురోడ్, మదరాసు.**



We all use **SRIVIS-AMLA**
HAIR OIL


మేమందరమూ

శ్రీవిస్ - ఆమ్లా

తలనూనెనే వాడెదము — ఎందుకంటే ఇతరనూనెలు ఏవివాడినా, కురులు ఇంత విగనిగలాడవు. కురులు దువ్వుటకు మృదువుగానుండి, నీటుగా ప్రకాశించును. శ్రీవిస్ - ఆమ్లా కురులను పెంపొందించునని కూడ మరువకుడు.




**S. VISWANADHAM & CO**
44, BUNDER ST. G.T. MADRAS





వ్యాపారస్తులకు

## మా మనవి

సరుకులు తక్కువ ధర కిచ్చేస్థలానికే రండి

మరియు వ్యాపారస్థుల మన్నికల ననుసరించి, బైటూరి ఆర్డర్లను నిరంతరం సప్లయి చేయుటకు విశేషంగా నిల్వ చేసి వుంచినాము, మా కంపెనీయందు,

| | | | |
|---|---|---|---|
| సన్నరాష్ట్రం | కస్తూరిపసుపు | వట్టివేరు | పరంగిచెక్క |
| జాజికాయ | మాసుపసుపు | వస | మాపళకాయ |
| జాపత్రి | లవంగపట్ట | అక్కల్‌కారా | కచ్చూరాల్ |
| పిప్పిళ్లు | లవంగాలు | చలవమిరియాలు | మూశాంబరం |
| నేర్వాళం | నాయువులంగ | ఓమం | పాల్‌మడ్డి |
| శొంఠి | అజమోదరం | సాంబ్రాణి | సుగంధవేరు |

ఇల్లాంటివి మావద్ద యితర రకాల మందుల మూలికలు లెక్కలేనన్ని లభించును. లభించు స్థలము :

ఎగుమతి దిగుమతిదారులు :

# D. PEIRIS & CO.

(BRANCH) 24. BADRIAN ST, G.T. MADRAS (TEL: SUMATIPALA)

PHONE: 5196., TEL: REDWOOD

NO. 8-10. GABO'S LANE, (HO) PETTAH, COLOMBO.

బాలలు!

*

# "చెరపకురా చెడెదవు"

అని మీకు తెలుసుకదూ!

దుర్మార్గులంతాగూడి పతివ్రతను బంధింప సైంధవుడ్ని పంపుతారు తత్కాలికంగా జయంకలిగినా. చివరకు వానిగతి యేమయింది?

మీరంతా

శ్రీ వెంకట్రామా పిక్చర్సువారి

# బ్రహ్మరథం లో చూడండి

దర్శకుడు:
చిత్రపు
నారాయణ
మూర్తి, బి.ఏ.

★

నటీనటులు:
అద్దంకి
పారుపల్లి
జయమ్మ
సరోజ
సౌదామిని
టి. కనకం
శ్రీరంజని
కుమారి
అనసూయ



కవి:
బలిజేపల్లి

సంగీతం:
మోతీబాబు

నృత్యం:
వెంపటి

ఆర్టు:
శర్మ

స్టూడియో:
శోభనాచల

ఆంధ్రా: పూర్ణా పిక్చర్సు, గాంధీనగరం, బెజవాడ

రాయలసీమ: మల్లికార్జునా పిక్చర్సు, నంద్యాల

నైజామ్: దక్కన్‌ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్, హైదరాబాద్

## ఉజ్జ్వలమైన సతీత్వము



పండిట్ డి. గోపాలాచార్యులవారి

# అరుణ

గర్భాశయరోగ నివారిణి.

అరుణ ఋతుదోషము లను పోగొట్టి, పరిపూర్ణ స్త్రీత్వమును ప్రసాదించగల స్వయం సంపూర్ణమగు ఔషధము. అట్టి దానిని విడువక సేవించినట్లయితే, మిమ్ము ఆరోగ్యవంతులను జేయుటయేగాక, మీ జీవన పరమావధియగు ఆమందానందమును తప్పక యొసగును.




**ఆయుర్వేదాశ్రమం, లిమిటెడ్**
**టి-నగర్.... మద్రాసు.**

EASTERNS 378.






లివర్ & స్ప్లీన్ వ్యాధులచే బాధ పడుచు, యితర ఔషధములచే నివారింపబడజాలని శిశువులు వేలకొలది, యీ అద్భుతఔషధరాజముచే రక్షింపబడిరి.



జమ్మి వెంకట-రమణయ్యగారి


# లివర్ క్యూర్

జమ్మి వెంకటరమణాయ్య గారి 'లివర్ క్యూర్' ప్రసిద్ధిగాంచిన వైద్యులు దీనిని వైద్య శాస్త్రములలో కెల్ల నొక విశిష్టౌషధముగా శ్లాఘించుచున్నారు.

అంతటి మందుల షాపుల వద్ద దొరుకును లేనిచో క్రింది విలాసమునకు వ్రాయుడు.

**జమ్మి వెంకటరమణయ్య & సన్సు**
1/1, బ్రాడీస్ రోడ్డు, మైలాపూర్, మద్రాసు.

ఇంకను: బొంబాయి, కలకత్తా, లక్నో, బెంగుళూరు, విజయవాడల్లి విజయనగరములందు కూడ ఆఫీసులు గలవు.




'BALA' CHILDREN'S ILLUSTRATED MONTHLY

సంపాదకుడు : న్యాయపతి రాఘవరావు బి.ఎ.

సహాయ సంపాదకురాలు : న్యాయపతి కామేశ్వరి, బి.ఎ.ఎల్.టి.

సంపుటి 2 ] మే 1947 [సంచిక 10.



# చెన్నపట్టణం

చెన్నపట్టణం అరవవాళ్ళదా? తెలుగువాళ్ళదా? అని తగువు వచ్చింది. పూర్వం చరిత్రల్లో చెన్నపట్టణం మన తెలుగువారిదే అని రాసివుంది. చంద్రగిరి రాజులు యీ దేశాన్ని ఏలుతూ వుండేవారు. వర్తకులంతా తెలుగువారే. నాయుళ్లు, తెలగాలు అనేకమంది తెలుగువారే. హరిజనులంతా తెనుగువారే. పూర్వకాలంనుంచీ తెలుగు వంశాలు చాలా ఇక్కడున్నాయి. కాని, రానురానూ అరవవాళ్లుకూడా వాళ్ళ దేశంనుండి వచ్చి ఉద్యోగాలన్నీ వాళ్ళే తీసుకున్నారు. అందుచేత ఉద్యోగస్తులు చాలామంది అరవవాళ్లున్నారు. బడులలో అరవం నేర్పడం మొదలెట్టారు. తెలుగు భాష సన్నగిలి...బడులలో అరవమే చెప్పడం మూలాన్న, చాలామంది తెలుగువారుకూడా అరవం చదవవలసి వచ్చింది! తెలుగు మరిచిపోయారు కూడాను!

ఇప్పటికికూడా చెన్నపట్టణంలో కార్పరేషను బడులలో ఎక్కువగా అరవమే చెప్తున్నారు.

ఆ బడు లన్నిటిలోనూ తెలుగు తరగతులు కార్పరేషనువారు పెట్టించాలి. కొత్త తెలుగు బడులు తెరవాలి. నిర్బంధంగా తెలుగు పిల్లలకు తెలుగే నేర్పించాలి.

ఈ సందర్భంలో మదరాసు ఆంధ్రులుకూడా గట్టి పట్టుదలతో పనిచేయాలి. మైలాపూరు లో కేసరీ కన్యా విద్యాలయమునకుగాను లక్షరూపాయిలు విరాళమునిచ్చిన డాక్టరు కె. యన్. కేసరిగారు తెలుగు పిల్లలకు, తెలుగు భాషకు చేసిన మేలు మరువజాలం. డాక్టరు కేసరీగారికి మా జోతలు.



# వేణ్ణీళ్లా - చన్నీళ్లా?

[ఈ "ఆట - పాట" కనిగిరితాలూకా ప్రాంతాల్లో వాడుకలో వుంది.]

గుడు గుడు గుంచం
గుండా రాగం
పాముల పట్టం
పడగా రాగం
అప్పల్రాజు గుఱ్ఱం
ఆడుకోబోతే
పేపే గుఱ్ఱం
పెళ్ళికిపోతే
నీ గుఱ్ఱం
నీళ్ళకుపోతే
నా గుఱ్ఱం
పాలకుపోతే
కత్తెయ్యానా?
బద్దెయ్యానా?
వేణ్ణీళ్లా?
చన్నీళ్లా?

సంపాదన: ధూళిపాళ్ల కృష్ణమూర్తి.

# అబ్బాయమ్మాయ్

అ బ్బా యి




అ మ్మా యి

ఈ ఒక్క—బొమ్మలోనే అబ్బాయి అమ్మాయీ ఉన్నారు. బొమ్మలో మీదికి బా ⁝ ల వున్నచోట, ఒకకాగితం అంచు 'బా' వరకూ కప్పితే ఒక అమ్మాయినీ, అటునుంచి 'ల' వరకూ కప్పితే ఇటువైపు ఒక అబ్బాయీ మిమ్మల్ని పలకరిస్తారు.... ఏం ?

# మా బావ రాక

రచన : నాగవోలు వెంకట అప్పారావు (పాలకొండ)

ఆదివారమునాడు
అత్త వచ్చింది
సోమవారమునాడు
మామ వచ్చాడు
మంగళవారమున
మామ్మ వచ్చింది
బుధవారమున తాత
ఉదయాన వచ్చె
లక్ష్మివారము రాత్రి
లలిత వచ్చింది
శుక్రవారమునాడు
సుధ, సుమతి వచ్చె
శనివారమునాడు
సోమసుందరుడు
అందరూ వచ్చారు
ఆనందముగను
అందాల మా బావ
అసలు రాలేదు.


# సెలవుల్లో సరదాలు

("బాల" చదువరులకు ప్రత్యేకం)

## గాజుగోళీ - కాగితం

బాలా! మీ స్నేహితులు మీ ఇంటికివస్తే యీ తమాషా చేసి చూపించు.

ఒక గాజుగోళీ, ఒక కాగితం



తెచ్చి, "ఆ కాగితం కన్నం చేయకుండా అందులోనుంచి గాజు గోళీని వేయగలవా" అని అడుగు.

నీ స్నేహితుడు తెల్లమొహం వేస్తాడు. అప్పుడు నువ్వు: "సరే ఇదుగో చూడు నేను చేస్తాను" అని ఆ కాగితాన్ని గొట్టంలాగ



చుట్టి అందులోనుంచి ఆ గాజు గోళీని పడేయి!


తెలిసిందా యీ గమ్మత్తు.

## చదరాల గమ్మత్తు


ఈ దిగువ బొమ్మలో లాగ మూడు చదరాలు గీయి.




"ఈ మూడు చదరాలనీ అయిదు చదరాలు చేయాలి. చేయగలవా"--అని నీ నేస్తాన్ని అడుగు. నేస్తం తెల్లబోతే నువ్వు ఇలాగ చేసిచూపించు.




ఈ గమ్మత్తులు నీ కెవరు చెప్పారూ అని అడిగితే 'బాల' చెప్పిందని చెప్పు.




♦ ♦ రచన: "ఆరుద్ర" ♦ ♦

సీత చీమలతో జట్టు కట్టింది. సీత "అనగనగా ఒకరాజు ఆ రాజుకి ఏడుగురు కొడుకులు" అన్నకథ ఎప్పుడు విందో అప్పటి నుంచీ చీమలతో నేస్తం కడదా మనుకొంది. ఏమంటే "నా కన్నంలో వేలు పెడితే కుట్టనూ?" అని చీమ చక్కటి జవాబు చెప్పిందికదూ. చీమ మంచి మనస్సుగలది కాబట్టే ఆ జవాబు చెప్పింది.

చీమ మనజోలికి అనవసరంగా రాదు. అలాగే దాని పనులలో, దాని కన్నంలో మనం అనవసరంగా జోక్యం కలుగచేసుకొంటే తప్పకుండా కుడుతుంది. చెడ్డపిల్లలు దాన్ని ఆ తరవాత చంపేసినా దానికి విచారం ఉండదు.

ఇవన్నీ ఆలోచించుకొంది గానీ చీమలతో ఎలా జట్టు కట్టాలో సీతకి తెలీలేదు. ఒక నాడు చాలా గమ్మత్తుగా సీతకీ చీమకీ స్నేహం కుదిరింది. ఎలాగంటే సీత అందరి పిల్లలలాగే పప్పు బెల్లాలతో బొమ్మలపెళ్లి ఆట ఆడుకొనేది. ఒకసారి లక్కపిడతలో బెల్లం ఉంచి ఆ పిడతని బొమ్మరింట్లో మరిచి పోయింది. మర్నాడు, మళ్లా



ఆడుకొనేటప్పుడు ఆ పిడతలో బెల్లంనిండా చీమలున్నాయి.

ఎక్కడో ఉన్న కన్నందగ్గర నుంచి బొమ్మరిల్లుదాకా ఒకటే బారు. సీత ఒక చెంబుడునీళ్లు ఆ చీమలన్నింటిమీద పోసేదా మనుకొంది. సీత మంచిపిల్లేగాని మంచివాళ్లకి కూడా ఇలాంటి బుద్ధులు పుడుతూఉంటాయి, గానీ మంచివాళ్లు ఇలాంటి ఆలోచనలను అణుచుకొని మంచీ చెడ్డా చూసుకొని మరీ ఏ పనేనా చేస్తారు.

సీత పోసే చీమల తిండిలో నీళ్లెందుకు పొయ్యడం, వాటి కూడులో బుగ్గెందుకు కొట్టడం అనుకొని వెళిపోతూ ఉంటే ఒక చీమ, సీత కాలు మీద కెక్కి పాదాన్ని కుట్టింది. "అమ్మో!" అని మెల్లిగా మనస్సులోనే అనుకొని సీత తనపాదాన్ని చూచింది. ఒక చిన్నచీమ ఏదో తప్పచేసినట్టు అక్కడ అణిగిమణిగి ఉంది. సీత చీమని మెల్లిగా తీసి చేతులో పట్టుకుంది.



చీమ అప్పుడు "సీతా! నువ్వు మంచిపిల్లవి. నిన్ను నేను కుట్టినా నన్ను నువ్వు చంపేలేదు. పైగా నన్ను నీ కాలిమీదనుంచి చాలా సున్నితంగా తీసి పట్టుకున్నావు. నువ్వు మంచిదానివి కాబట్టి నీతో నేను నేస్తం కడతాను." అంది.

సీత ఆశ్చర్యపడింది. చీమ మాట్లాడుతున్నదని నమ్మలేక పోయింది. చీమలు తప్పించి మరేవీ కుట్టవు. పాములూ తేళ్లూ కుడతాయి కానీ అవి చుట్టుపక్కల లేవు. మనుష్యులు కుడతారని సీత కప్పటికి తెలీదు. కాబట్టి చీమే మాట్లాడి ఉండాలి. అయినప్పటికీ సీత ఈ మాటలని తను ఊహించుకొని ఉండాలనుకొంది.

చీమ మళ్లా "సీతా నువ్వు అనుమానించకు. నేనే చీమని మాట్లాడుతున్నాను. ఏం నాతో నేస్తం కడతావా?" అంది.

సీత "సరే! నువ్వూ నేనూ ఇవాళనుంచీ జట్టు!" అంది.

"అయితే, మాయింటికి భోజనానికి రా" అంది చీమ.

"ఛీ! ఎవరైనా చీమలయింటికి భోజనానికి వెళతారా?" అనుకొంది సీత. అవును, పక్కింటి నాయుళ్ల యింట్లో ఫలహారాలు తినకూడదని నాయనమ్మ అంటుంది. గానీ నాన్న తప్పులేదని అంటాడు. స్నేహితుల యింట్లో భోజనం చెయ్యవచ్చు.

"సరే! చీమా, చీమా మీ యింటికి భోజనానికి వస్తాను, గానీ నువ్వింత చిన్నదానివికదా మీ భోజనం నాకు ఒక పంటికిందకేనా రాదు. మరెలాగ?" అంది సీత.

"నీ కలాంటి భయం అనవసరం. మా చీమలన్నీ సాయం

చేస్తాయి. నువ్వు తప్పకుండా రావాలి'' అని చీమ బలవంతం చేసింది.

సీతకి మరో అనుమానంకూడా పట్టుకొంది. తను చీమలకన్నంలో పట్టదే! మరెలా చీమయింటికి భోజనానికి వెళ్లడం? చీమతో ఈ సంగతికూడా చెప్పింది.

అప్పుడు చీమ ''ఫరవాలేదు సీతా. మా దగ్గర ఒకమందు ఉంది. అది నువ్వు పుచ్చుకొంటే మా యింటికి నువ్వు ఏ ప్రమాదం లేకుండా రావచ్చు. నిజానికి నువ్వు నాతో మాట్లాడగలిగిందికి ఈ మందే కారణం. నిన్ను కుట్టినప్పుడు ఆ మందుని నీ శరీరంలోకి పంపించేను తెలుసా! మాయింటికి నువ్వు వచ్చిందికి వీలుగా నిన్ను ఇంకోసారి కుడతాను.'' అని సీతని చీమ యింకోసారి కుట్టింది. వెంటనే సీతకూడా ఒక పెద్ద చీమంత అయిపోయింది. సీతా చీమా కలసి చీమయింటికి భోజనానికి వెళ్లేందుకి బయలుదేరారు.

(బాలా! నీకు నిద్రవస్తున్నట్టుంది. పడుకో! మళ్లా వచ్చేసారి సీత కథ చెప్తాను).


రంగుల పెట్టెలు - ట్యూబులు

(సుప్రశిద్ధ "స్పిన్నీ" వారి తయారు)



బడిపిల్లలకు - చిత్రకారులకు

★ నీటిరంగులు (Water Colours)
★ చిత్రకారుల రంగులు - పెయింట్లు
★ పోస్టరు రంగులు
★ రంగు సుద్దలు

ఈ రంగులతో మీ డ్రాయింగులను అందముగా వేయవచ్చును.

చక్కని బొమ్మలు తయారు అగును.

టోకు ధరలకు - ఏజన్సీ షరతులకు వ్రాయుడు.

సోల్ డిస్ట్రిబ్యూటర్సు: స్టేట్సు ప్రోడక్ట్సు.

12, నోబిల్ ఛాంబర్సు, పార్సీబజారు వీధి, బొంబాయి 1.

# బొమ్మల పెళ్లి

"ఏమే వనజా, నేడు మనం బొమ్మలపెళ్లి ఆట ఆడుకుందామా?" అంది సరోజ.

"ఊ! అలాగేకాని," అంది వనజ.

"మన కిప్పుడు సెలవులేగా, పెళ్లి బొమ్మలకేచేసినా, విందు మాత్రం నిజంగా చేదామే", అంది సరోజ,

"మరేమో, ముందే చెబుతున్నానమ్మా, వంటపూచి నాది" అంది వనజ.

సరోజ తలపెట్టినపని జరిగితీరాల్సిందే. తోటి బాలలందరిని పిలిచింది బొమ్మలపెళ్లికి, పెళ్లి మహావైభవంగా జరిపించారు. విందుకు వచ్చిన వాళ్లందరికీ వడ్డించింది వనజ తనుచేసిన పిండివంటలను.

"పులుసు కమ్మగావుంది నా కొంచంవేయి వనజా" అని, "ఎంత రుచిగా వుంది నాకు మరికొంచం", "గుమగుమ లాడ్తోంది నాకు యింకొంచం" "ఫస్టుక్లాసుగావుంది, మరి నాకో" అని చేసిన పులుసంతా కాజేసారు బాలలు.

"వనజా! పులుసెంత బాగాచేసావు. నే పెడితే ఇంతరుచిరాదు, ఎలా చేసావో చెప్పవ్" అంది సరోజ.

"ఈ రహస్యం యెవరికీ చెప్పకుసుమా. నే చేసినపులుసులో కొద్దిగా **తిలక్ మార్కు యింగువ** వాడాను. దాని ప్రభావమే యిదంతా", అంది వనజ.

"అదెక్కడ దొరుకుతుందో చెప్పి పుణ్యంకట్టుకో వనజా, యికమీద నేనుకూడా అదే వాడుతాను", అంది సరోజ.


"అన్నికొట్లలో అమ్మబడుతుంది, లేదేని ఈదిగువ యడ్రసుకి రాయి:

---

**గోపాల్జీ చాంపషీ అండు కో.,**


30. గోవిందప్ప నాయక వీధి, జి. టి. మద్రాసు 1.

# ఊసుపోని పిల్లి





★

అనగా అనగా "మ్యావ్" అనే పిల్లి పిల్ల వుంది. దానిక పరీక్షలు అయిపోయాయి. ఎండాకాలం సెలవు లొచ్చాయి. ఏమి చేయడానికీ తోచలేదు. అసలే అల్లరిపిల్లి! అంచేత ఇంట్లో



పాలు అందకుండా వుట్టిమీద పెట్టేశారు! ఏమిచేయడానికీ తోచక పిల్లి పెరట్లోకి వెళ్లింది. ఆ పెరట్లో ఆవు గడ్డి మేస్తోంది. ఆవు దగ్గరికెళ్లి: "నాకు పాలు ఇస్తావా, లేకపోతే నీ తోక కఱిచేదా?"—అని అంటూ దాని తోక కఱిచింది. ఆవు వూరుకుంటుందా? పిల్లిపిల్లని తన కొమ్ములతో పొడవబోయింది. పిల్లిపిల్ల "మ్యావ్ మ్యావ్" అంటూ ఒకటే పరుగు! ఊసుపోక పోతే అల్లరిపనులు ఇలాగే వుంటాయి కదూ?





# కాకి పిట్ట ఎంత మంచి గడుసు పిట్టరా!


రచన: చామర్తి కామేశ్వరరావు (కాశీబుగ్గ)

కాకిపిట్ట ఎంతమంచి – గడుసుపిట్టరా!
చుట్టాలరాక తెల్పు మనకు – చోద్యముకదరా!
"కావు" మనుచు కాకివచ్చి – గడప ఎక్కింది
నన్నుచూచి గంతులేసి – కన్నుత్రిప్పింది.
"పక్కాలొస్తె కాకిపిట్ట! – పారిపో" అన్నాను
"చుట్టాలొస్తె కాకిపిట్ట! – చూపు" అన్నాను
"అత్తవస్తె కాకిపిట్ట – అఱచు" అన్నాను
"మామవస్తె కాకిపిట్ట! – మళ్లు" అన్నాను
"బావవస్తె ఎదురుగాను – పోవె" అన్నాను
"కావు కావు కావు" అనుచు – కాకి పాడింది
వీధిలోకి గెంతుకుంటు – వెళ్లిపోయింది

ఔఔ ఔఔ ఔఔ

ఇంతలోన బావవచ్చి – చెంతనిల్చేడు
బావచేతిలోని సంచి – పట్టుకున్నాను
"బాగా, బాగా, బాగా మీరు – బావా!" అన్నాను
బావతోను కలసి అమ్మ – వద్దకెళ్లాను
"బావతెచ్చిన వస్తువులన్నీ – బలే!" అన్నాను
బావవచ్చిన నాడుమాకు - పండుగన్నాను
కాకిపిట్ట ఎంతమంచి - గడుసుపిట్టరా!
చుట్టాలరాక తెల్పుమనకు – చోద్యముకదరా!

# ఈ బొమ్మలో ఒక కథ




అనగా అనగా అడవి. ఆ అడవిలో అనేక జంతువు లున్నాయి. ఒకనాడు రాధ, గోపీ ఇద్దరూ ఆ అడవికెళ్లారు. అక్కడ వాళ్లకి ఏదో చప్పుడు వినిపించింది. భయంవేసింది. ఇటూ అటూ చూశారు. ఏమీ కనబడలేదు. 1 నుండి 65 వరకు అంకెలుమాత్రం కనబడ్డాయి. ఏమీ తెలియక, ఇంకా భయంవేసి, దాగున్నారు.

బాలా! ఆ అంకెలు వరుసగా గీతతో కలిపిచూడు. ఆ ఇద్దరూ ఎక్కడ దాగున్నారో చెప్పుకో.




# "చంచల బరిణె"

ఆదికాలంలో అందరూ మంచిగా సుఖంగా వుండేవారు. ఎవరూ జబ్బుపడేవారు కాదు. ఎవరూ కోపగించుకునేవారు కాదు. ఎవరికీ ముసలితనం వచ్చేది కాదు.

పిల్లలందరూ అడవులలోనూ తోటలలోనూ అలుపులేకుండా ఆడుకునేవారు. ఆడేటి పిల్లలతో పాడేటి పిట్టలు పొద్దు పుచ్చుకునేవి.

ఆ ప్రపంచంలో అంతగా ఎండ వుండేదికాదు. చీదరైన చలిపుట్టేదికాదు. గాలి వీస్తోంటే కూలిజనులకు కూడా కేళీవిలాసం కలిగించేది.

రచన:
శిష్ట్లా ఉమామహేశ్వరరావ్

ఇంత సంతోష ప్రపంచమూ ఒక్క ఆడపిల్ల అఖాయిత్యంతో మారిపోయింది.......

ఆ రోజులలో ఒక ప్రజాపతి వుండేవాడు. ఆయన కన్నీ వున్నాయిగాని ఆడసొత్తు లేదు. ఆ సంగతి తెలుసుకున్న దేవతలంతా ఓసారి ఒకచోట చేరి ఆయనకు ఒక ఆడపిల్లను బహుమానం చేద్దామనుకున్నారు. అనుకోవడ మాలస్యంగా చంచలి అనే పిల్లను ఆయన దగ్గరకు పంపారు.

ఆ ప్రజాపతి చంచలినిచూచి సంతోషించాడు. చంచలితో కాపుర మారంభించాడు.

రోజులు గడిచినతర్వాత దేవతలంతా తమపిల్లకు కానుకగా ఓ బరిణను పంపారు. ప్రజాపతి బరిణను తీసుకువచ్చి చంచలికిస్తూ ఇలా అన్నాడు:

"ఈ బరిణను మీవాళ్లు పంపించారు. సంవత్సరాదినాడు దేవతలరాజువచ్చి అయనంతటాయన దీనిమూత తీస్తాడుట. అందాకా తెరవకుండా నీదగ్గిర వుంచుకోమని మీవాళ్లన్నారు. జవదాటేవు సుమీ!"

ఆ బరిణను చూచి ఆ పిల్ల మహాసంతోషించింది. తనవాళ్ల కానుకగనక తగుపదిలంగా ఓ ఎత్తైన పీటమీద దాన్ని పెట్టింది.

దినదినమూ చంచలి ఆ బరిణనుచూచి "ఇవ్వాళ దీన్ని తెరిచి చూస్తే ఎంతబాగుండునూ" అనుకునేది. "అమ్మయ్యో దేవతలేమంటారో" అనుకుని వూరుకునేది.

ఓరోజున చంచలి ఆ బరిణను చూచింది. దానికి దారాలు కట్టివున్నాయి. "తాళం వుండగా దారాలెందుకూ!" అని ఆదారాలు వూడదీసింది.

మరోరోజున చంచలి ఆ బరిణను చూచింది. "మాయింట్లో దొంగలులేరుగా దీనికి తాళాము మాత్రమెందుకూ? దేవతలరాజు వచ్చి తెరుద్దామనుకున్నప్పుడిదొక ఆలస్యమా!" అని ఆ బరిణ తాళాన్ని వూడదీసింది.

ఇంకోరోజున చంచలి ఆ బరిణను చూచింది. దానిప్రక్కనే కూర్చున్నది. నిట్టూర్పు విడిచింది. చెంపన చేయిపెట్టుకుని ఆలోచించింది.

"ఈ బరిణను నాకు బహుమానం చేశారుగదా, దీన్ని తెరిచిచూస్తేయేం? అందులో ఏముందో దాన్ని వాడకూడదు. నిజమే, తెరిచిచూస్తే తప్పులేదనుకుంటాను. బరిణ నాదేగా!" అనుకున్నది చంచలి.

అనుకుంటూనే ఆ బరిణను తెరిచింది.

బరిణమూత సగం తెరవంగానే అందులోంచి అనేకమైన

దయ్యాలు ఎగిరివచ్చాయి. ఆ దయ్యాలు ఇంటి నాలుగుమూలలనూ ఆక్రమించాయి. వాటిని తాకితే చాలు అనుకోని అష్టకష్టాలూ అంటుతాయి.

చంచలికి భయం వేసింది. వెంటనే ఆ బరిణను మూసివేసింది. కాని అంతకుమునుపే ఆ దయ్యాలన్నీ అటూయిటూ ఎగిరి చెదిరాయి. చంచలి వాటిని పట్టుకోపోయింది. వాటిని ముట్టుకుంటే వెయ్యి కందిరీగలు కుట్టినట్లు నొప్పిపుట్టింది. ఆమె యేమీ చేయలేక నట్టింట చతికిలబడింది. ఆయింటి నాలుగు మూలలకూ యెగిరిపోయిన ఆ దయ్యాలు అంతంత మాత్రానివి కావు. మొదటిదానిపేరు: అసూయ; రెండోదానిపేరు: అన్యాయం; మూడోదానిపేరు: అస్వాతంత్ర్యం; నాల్గోదానిపేరు: అహంభావం. ఇవిగాక వీటిపిల్లలింకా యెన్నో వున్నాయి.

నట్టింట దీనంగా చంచలి కూర్చునివుండంగా ఆమె భర్త యింటికివచ్చాడు. లోన అడుగు పెట్టంగానే ఆ నాలుగు దయ్యాలూ వెంటనే ఆయన్ని కరిచాయి. ఆదయ్యాలకాట్లు పొందినతర్వాత ఆ ప్రజాపతి మారిపోయాడు.

ప్రజాపతి మారిపోగానే ఆయన యింట్లోనూ మార్పులు కలిగేయి. ఆనాటినుంచీ చంచలి ఇంటిపనులు చేసుకోడంలోనే మునిగిపోయేది. ప్రజాపతి తన యింటి చుట్టుప్రక్కల ఆస్తినేగాకుండా లోకువైనవాళ్ల ఆస్తులనన్నిటినీ కలుపుకున్నాడు.

ఆనాటినుంచీ మనుష్యులూ ప్రకృతీ వేర్వైపోయారు.

అయితే ఓమాట! చంచలి ఆబరిణను తెరిచిమూసేసినప్పుడు ఆఖరున ఓ ప్రాణిమాత్రం ఆ పెట్టిలో ఉండిపోయింది. పాపం ఎంతగింజుకున్నా అసలే భయపడిపోయిన చంచలి మళ్లీ ఆ పెట్టిని తెరవలేదు. అందువల్ల ఆ ప్రాణిమాత్రం జనులందరితోబాటు ప్రపంచంలో కట్టుబడిపోయింది. దానిపేరే "ఆశ".

# వేసవి సెలవుల్లో

మనమల్లె తోటలో
మందార వనములో
ఆనంద వనములో
ఆడుకుంటున్నారు!
తెల్లని వెన్నెట్లో
చల్లని గాలిలో
చూడవే పిల్లలు
ఆడుకుంటున్నారు!
అమ్మా నేపోతాను
అక్కాయితోకలసి
వేసవిసెలవుల్లో
వేడుకతో వెళతాను.
ఆటలా పాటలా
ఆడుకొని వస్తాను.
ఆడుకుంటామమ్మ
ఆడుకుంటాము
ఆడుకోడానికి
వేడుకుంటాము.

రచన: యల్. దూర్వాసులు.
(సదకుప్పం)


## జాబ్‌కో వస్తువులు
అన్నీ స్వదేశీవే.

మీకు కావలసినవి — సబ్బులు, నూనెలు, పౌడర్లు మొదలైనవన్నీ జాబ్‌కోవారే తయారుచేస్తున్నారు. మీరు స్వదేశీవస్తువులనే వాడవలెనని వేరే చెప్పాలా? జాబ్‌కో మార్కు గల వస్తువులే, అన్నిటి కంటే ప్రసిద్ధమైనవి. స్వదేశీనే కొనుడు. జాబ్‌కోనే కొనుడు.

●

మేము తయారుచేయు వస్తువులు:

హేర్ గ్రోయర్, స్నో, లిక్విడ్ బ్రిలెంటైన్, బ్రిలెంటైన్, సుగంధపు ఆముదం, సుగంధపు కొబ్బరి నూనె, లైంగ్లిస్, హెర్బాం, శాండల్ ఉడ్ సబ్బులు మొదలైనవి.

●

జయభారతం కంపెనీ
మదరాసు - బెంగుళూరు - ఎర్ణాకులం.

# తలుపులు

రచన: ఈరంకోరబ్బాయ్

"ఏమిటండోయ్ సినబాబు గారు మాంతీచ్చణంగా సదుంతున్నారు." అన్నాడు తలుపులు.

ఆ, ఇది చిన్నపిల్లలు చదువుకునే పుస్తకం దీనిపేరు "బాల" అన్నాను.

"అయితే సిన్నపిల్లలకి ఏరే పుత్తకాలుంటయ్యేటండీ" అన్నాడు.

మరి పెద్దవాళ్లు చదివే పుస్తకాలు చిన్న పిల్లలు చదవగలరా? అసలు పిల్లలకి ఆటమీాద ఉన్న దృష్టి పుస్తకాలమీాద వుండదు. ఇటువంటి బొమ్మల పుస్తకాలైతే చక్కగా చదువుకుంటారు. చదువుమీాద సరదా ఏర్పడుతుంది. ఇంక అక్కణ్ణించి వొద్దన్నాగాని అన్నిపుస్తకాలు చదువుతారు.

"యాటోనండి మీా బొమ్మల్లు ఎలాగైనా పిల్లలకి సదువునేర్పుతారండి. మా కుఱ్ఱాడ్ని ఎన్ని సార్లు బడికిపంపినా ఓ అచ్చరం ముక్క రాదండి. అందుకనే మాకు డొక్కసుద్ది లేదండి" అన్నాడు తలుపులు.

ఆతప్పు మీా పిల్లలదిగాదు; మీాదే. మీారు పట్టుబట్టి చదువు చెప్పిస్తే ఎవడికోసం వస్తుంది! కావలిస్తే ఇప్పుడు నువ్వుకూడా చదువుకోవచ్చు. మీాకు పగలల్లా పనితీరికవల్ల చదువుకుందుకు వీలుండదని రాత్రుళ్లు చదువు చెబుతారు. మీాకా శ్రద్ధవుండాలి. అయితే అలాటిబళ్లు ఇంకా మన వూరిలో బయలుదేరలేదు.

తలుపులు పకాలున నవ్వాడు. 'ఏమిటండోయ్ శినబ్బాయిగోరు మాయిచిత్రంగా మాటాడుతున్నారు. ఏదో సామ్యా జెప్పినట్టు అరవై ఏళ్లొచ్చాక సదుంకోక మన్ను గొట్టుకోనా అన్న

ంది. మాకెందుకండీ సదువు. ఏదో మీ పాదాలకాడ మా జీవితం ఇట్టా ఎల్లిపోద్ది'' అన్నాడు.

నువ్వు చదువుకోకపోతే పోనీ గాని మీవాణ్ణికూడా నీలాగ తయారు చెయ్యకు. ఈ వేసంకాలంలో నాకు తీరుబడేరోజు మీవాణ్ణి నాదగ్గరికిపంపు. పాఠాలు చెబుతా అన్నాను.


''మహాప్పెబువులు—సరిగానండి అబ్బాయిగోరు మీరు పెత్రికలకి ఏదో కథలు గట్రా రాత్తున్నారని నాన్నగోరు ఆ లచ్చిన్నారాయణ గోరితో శెబుతుంటే ఇన్నాను - ఎప్పుడేనా ఓకథలో నాపేరుగూడా రాయించండి. అదే మనవి జేసుకుందా మనొచ్చాను.'' అన్నాడు దీనంగా.

అలాగేతేగాని నీపేరు చదువుతే అందరూ నవ్వుతారు. తలుపులూ ద్వారబంధాలు అని. ఈపేరు ఇటువేపు జిల్లాల్లోనేగాని మరెక్కడాలేదు. అయితే రాయమంటావా? అన్నాను.

''మీరు ఎలాగైనా రాయించండి. నాపేరుసూసి నవ్వితే నవ్వ నివ్వండి. ఆళ్ళందరూ నా పేరు సదువుతేనే శాన. ఆ పెత్రికలో నాపేరు మా బామ్మరిదికి, కరణం ఎంకట్రావుగోరికి సూబించి నేను ఎంత గొప్పోణ్ణో సెప్పాల. మరయితే త్వరగా రాయించండి. ఆ పేపరు యీ నెల్లో తెప్పించండి. శలవు'' అని మురిసిపోతూ వెళ్ళిపోయాడు తలుపులు.

నేను తలుపులు వేసేసి మళ్ళీ బాల పుస్తకం తీశాను.




ఎండాకాలం సెలవుల్లో చదువేమిటి? ఇన్నాళ్లూ కష్టపడి చదివారు. పరీక్షలు ప్యాసయారు. ఇంక ఈ బొంగరం చదువు కొన్నాళ్లు చదవండి—ఏం?....

గిరగిర తిరిగే
బొంగరమా
గిఱ్ఱున తిరిగే
బొంగరమా
గీర గీరలా
బొంగరమా
గిరిలో తిరిగే
బొంగరమా
రంగు రంగులా
బొంగరమా
రంగడు ఆడే
బొంగరమా

అల్లె త్రాడువదలి
బొంగరమా
అరచేతిలోనాడే
బొంగరమా
ములికిమీదను
పుడమిలాగున
మెఱయుచు
మురియుచు
ఉఱ్ఱుమంటూ
గిఱ్ఱుమంటూ
గిరగిర - బిరబిర
తిరిగే బొంగరమా।

రచన: సరస్వతి (బొంబాయి)




రచయిత : కొండపల్లి వెంకట రామదాస్, తుని.

## 3-వ మజిలీ

మూడవ మజిలీలో బియ్యం తేవటానికెళ్లి వచ్చిన మన బాలయ్య, తాతయ్యతో ఇలా అంటూన్నాడు: ‘‘తాతయ్యా! ఈ ఊళ్లో నడిబజార్లో పెద్ద రాతి స్తంభంమీద ఇలా చెక్కబడివుంది. ‘విద్యలేనివాడు పశువుతో సమానము; ఈ రాజ్యంలో విద్యరానివానికి శిక్ష.’’ అదీగాక, ఇక్కడ ఏవీధిలో చూద్దామన్నా బడులే! మేష్టార్లే! కుర్రాళ్లే! దీనిసంగతి చెప్పవు తాతయ్యా!

తాతయ్య ఘట్టి పొడుంపట్టు వకటి ముక్కులోకి ఎక్కించి ఇలా చెప్తున్నాడు :


### ‘‘విద్యలరాజు కథ’’

విను బాలయ్యా! పూర్వం ‘‘[illegible]వతి’’ అనే రాజ్యాన్ని చంద్రసేన మహారాజు బహు చక్కగా పరిపాలిస్తూండేవాడు. అతనికి చాలాకాలానికి ‘‘శూరసేనుడ’’ను కొడుకు పుట్టాడు. లేక లేక కలిగిన కుమారుడు కావటంవల్ల, శూరసేనుడు అతి గారాబంగా పెరిగినాడు. అందుచేత చదువు సంధ్యలేమీ అబ్బలేదు. ఎప్పుడూ ఆటలే!

బాగుపడమని చెప్తారు కాని వినకపోతే పెద్దవాళ్లు ఏంచేస్తారు? అప్పటి అలవాటుప్రకారం శూరసేనుడికి వయస్సురాగానే రాజ్యాన్నిచ్చేసి, తపస్సుకోసం, అడవులకి వెళ్లిపోయారు అతనితల్లీ తండ్రీ! ఇక్కడ శూరసేనుడు తల్లితండ్రులు లేని విచారమే లేకుండా మరిన్ని సుఖాల కలవాటుపడినాడు. రాజకార్యాలు మంత్రుల

పరంచేశాడు. రాజ్యంలో అరాచకం ఎక్కువైంది, ఎటుప్రక్క చూచినా శత్రువులే! అయినా బుద్ధి లేక పశువులాగ ప్రవర్తిస్తూ వచ్చాడు శూరసేనుడు. ఇదిచూసి మంత్రులు కూడా కుట్రలు పన్నడం మొదలెట్టారు. చివరకి కంచే చేను మేసింది.

మర్నాడు శూరసేనుడు లేచేటప్పటికి, తానొక దట్టమైన అడవిలోవున్నట్టుగా తెలుసుకున్నాడు! అతనికి మతిపోయింది. అదంతా తన మంత్రుల కుతంత్రమే అని తెలుసుకోలేక పోయాడు. ఏమైతే ఏం చేస్తాడు? లేనిధైర్యంతో బ్రతుకుతెరువుకోసం లేచి బయలుదేరాడు. త్రోవలో ఎక్కడైనా క్రూరమృగం గాని కనిపించినా, దాని అరవు వినిపించినా అతి ప్రయాసంతో ఏదైనా చెట్టో, చేమో ఎక్కడం, ఆ గండం కాస్తా గడిచేక, మళ్లా తనకు తోచిన త్రోవ ద్రొక్కటం ... ఇలాగ చాలా కష్టాలతో ఆ అరణ్యాం దాటుకుంటూ - చివరకి ఓ చిన్న చెరువుదగ్గరకు చేరుకున్నాడు దాహం తీర్చుకునేందుకుగాను. శూరసేనుడు ఆ చెరువులో నీరు త్రాగేడో లేదో కాని, ఆతనికి జ్ఞానమనే కన్ను తెరచుకుంది. ఇదంతా ఆ నీటి మహిమేమో బాలా! మనకు తెలి



యడు. కనుచూపుమేరలో మన రాజుకి ఓ ఆశ్రమం కన్పించింది.

మూడు అంచీలలో అక్కడకు శూరశేనుడు చేరుకున్నాడు. అక్కడ ఎవరో మహాముని తపస్సు చేసుకొనడం చూచి, ఆయన్ని ప్రార్థించి శరణువేడాడు. దివ్యదృష్టిలో అతని చరిత్ర తెలుసుకున్నాడు ఋషి. రాజుని దీవించి ఇలా అన్నాడు! – "ఓ! శూరసేనా! నీవు పెద్దలమాట వినక, విద్యాశూన్యుడవై, ప్రపంచజ్ఞానం లేకుండా పోయి, ఎప్పుడూ భోగాలు అనుభవిస్తూ, రాచకార్యాలు మంత్రుల కొప్పగించి, ఆఖరికీ పరిస్థితికి వచ్చావు! కాని అయిపోయిందేదో అయిపోయింది! నాదగ్గర కొన్నాళ్ళపాటు వుండునాయనా! నీకు అన్ని విద్యలూ నేర్పుతాను."

ఇన్నాళ్ళకి శూరసేనుడికి పశ్చాత్తాపం కలిగింది. ఆ ముని వద్ద ఎంతో నియమంతో సకల శాస్త్రాలు నేర్చుకున్నాడు. చదువుల పండితుడయినాడు. ఆ ఋషి వద్దనే తన యావజ్జీవమూ గడపాలనుకున్నాడు. కాని ఋషి ఒప్పుకోలేదు. "శూరసేనా! నీవు ఇంకా చిన్నవాడవు. రాజ్యం పరిపాలించి ఎన్నో గొప్పకార్యాలు చేయాలి. ఇదుగో! ఈ వుత్తరం తీసుకొని కోసలమహారాజుకి చూపించు. నీకు శుభం కలుగుతుంది" – అని దీవించి పంపాడు ఆ ముని.

శూరసేనుడు ఋషి ఆజ్ఞ ప్రకారం కోసలరాజ్యం చేరుకొని కోసలరాజున కావుత్తరం ఇచ్చాడు. ఆ కోసలరాజు శూరసేనుడికి అనేకమర్యాదలుచేసి, ఒక మంచి ముహూర్తం పెట్టించి తన కూతుర్నిచ్చి పెళ్ళిచేశాడు. తన సైన్యాలతో అల్లుడికి తోడుగా వెళ్ళి, శత్రురాజులందర్నీ జయించి, అల్లుడిరాజ్యం అల్లుడికిచ్చాడు. తనరాజ్యంలో సగం భాగంకూడా అల్లుడికి దారపోశాడు.

తరువాత శూరసేనుడు హాయిగా రాజ్యం పరిపాలించాడు. తనకు విద్య, తెలివితేటలు లేనం దున రాజ్యంపోయిందని తెలుసు కొని, తనరాజ్యంలో ఎన్నో బడులు పెట్టించాడు.

"విద్యలేనివాడు పశువుతో సమానము. ఈ రాజ్యంలో విద్య రానివానికి శిక్ష" అని రాతి స్తంభాలు చెక్కించాడు. అవే ఇవి—అని మనతాతయ్య క[illegible] ముగించాడు.

"ఓహో! అందుకా ఈ రాజు 'విద్యలరాజు' అంటారు"— అంటూ మన బాలయ్య ఇంకో మజిలీకి సన్నాహాలు చేయడం మొదలెట్టాడు. ఇంకో మజిలీలో ఏమి జరుగుతుందో?...

చిట్టికవిత్వం


# జోలపాట

సంపాదన: శ్రీ సుశీలాదేవి

ఏప్రిల్ బాలలో చి॥ అప్పారావు అగ్గిపెట్టెమీద వ్రాసిన పద్యంచూచి బెజవాడలో చి॥ లక్ష్మి, చి॥ శాస్త్రి తమ ముద్దుతమ్ముణ్ణి నిద్రబుచ్చటానికి తల్లి జోలపాటను అనుకరిస్తూ యీ జోలపాట సృష్టించారు. ఇదుగో చదవండి—

పెద్దత్తలిద్దరూ అత్తింటికెళ్లేరు
చిన్నత్తలిద్దరూ చదువుకుంటున్నారు
నిన్నెత్తుకొనుటకు ఎవరు రారాయె
ఏడవకు, ఏడవకు చిన్నిపాపాయి
ఏడుస్తే నీకళ్లు నీళ్లుకారు
పాలైన కారవూ - జో....జో.

—లక్ష్మి, శాస్త్రి.




రచన: బి. వి. వి. ఆర్. సుబ్బారావు, (జాతీయ రచనామండలి)

అదిగో, అదిగో,
రైలుస్టేషన్
అగపడుచున్నది
రైలుస్టేషన్!

* * *

రైలుస్టేషనుకు వెళ్ళినచో
కనపడు మొదట హాలొకటి
ప్రయాణీకులు అచ్చటనే
రైలుబండ్లు వచ్చేవరకు
కూర్చొన బల్లలు వేయుదురు
అదియే వెయిటింగ్ రూమనగ:-

* * *

రైలుబండిలో ఎక్కుటకు
మొదటనె టిక్కెట్ కొనవలెను
అందుకు రైలుస్టేషనులో
టిక్కెట్లమ్ముదు రొకచోట
బుకింగ్ రూమని దానినియే
పిలుతుము మనము అందరము.

* * *

గేటుదగ్గ రున్నతనికి
టిక్కెట్ మనము చూపిస్తే
రైలుఆగెడి స్థలమునకు
వెళ్ళవచ్చు సామానులతో
ఆస్థలమునెమనము పిలిచెదము
ప్లాట్‌ఫారమను పేరునను.

ప్లాట్‌ఫారమన ఏమోకాదు
రైలుకమ్ములకు ప్రక్కననె
ప్రయాణీకులు రైలునను
ఎక్కిదిగుటకు వీలుగను
ఎత్తుగట్టు వెడల్పుగా
వేసివుండునదే ప్లాట్‌ఫారం

* * *


సిగ్నలుచెక్క వ్రాలనిదె
రైలుస్టేషనుకు రారాదు
సిగ్నలుచెక్క వ్రాలనిచో
రైలువెంటనే ఆగపుడు
కోయని కూతలు వేస్తుంది.

* * *

ప్రయాణీకులతో ప్యాసింజరును
ఉత్తరములతో మెయిలుబండియు
సామానులతో గుడ్సుబండ్లును
స్టేషనులోకి వస్తాయి.
వచ్చి కొద్దిసేపచ్చటఆగి
మళ్ళీ పయనం బైపోతాయి.
అదిగో, అదిగో,
రైలుస్టేషను.
అగపడుచున్నది
రైలుస్టేషను.—

ఎండాకాలంలో

# పొయ్యి పొగరు - కుండల కడగండ్లు



పొయ్యి: కుండ మరదలా! కుండ మరదలా!
రావె రావె రావె రావె - కుండ మరదలా!
చకచకమని వేగరావె - కుండ మరదలా!
కుతకుతమని పాటపాడె - కుండ మరదలా!

కుండ: పొయ్యి బావా! పొయ్యి బావా!
నేనురాను నేనురాను పొయ్యి బావా!
చిటచిటమను మంటదరికి - రాను బావా!
బొటబొటమని కంటనీరు - కలుగు బావా!

# పిచ్చి

బాలా బాలా
ఏంచేస్తున్నావ్ ?
పనిచేస్తున్నా
ఏమిపని
మట్టిపని
ఏమిమట్టి
బంకమట్టి
ఏమిబంక
తుమ్మబంక
ఏమితుమ్మ
ముక్కుతుమ్మ
ఏమిముక్కు
కాకిముక్కు
ఏమికాకి
నల్లకాకి
ఏమినల్ల
జుత్తునల్ల
ఏమిజుత్తు
పుట్టుజుత్తు
ఏమిపుట్టు
పిచ్చిపుట్టు
ఏమిపిచ్చి
బాలకు రాసేపిచ్చి!

రచన: డి. మోహనరావు,
(అనంతపురం)




# పిల్లలూ!

మంచి బాగా చేవ్రాత రాస్తే మంచి మార్కులు పరీక్షలో వస్తాయి. జాబ్కో పౌంట్ ఇంక్ తో రాస్తే ముత్యాల్లాంటి అక్షరాలు వస్తాయి. మీరు హిందూదేశములోని మంచి సిరానే వాడుచున్నారనుకుంటాము. స్వదేశీ సిరా వాడడమే మంచి అలవాటు.




## జాబ్కో ఫౌంట్ ఇంక్

ఇండియాలో మంచిది.

★

జయభారతం కంపెనీ

మదరాసు - బెంగుళూరు - ఎర్నాకులం.

# ★ పిసినిగొట్టు ★

రచన: ఊ. ప్రతాపరుద్ర
ఊ. రాజరాజనరేంద్ర. బాపట్ల.

అనగా అనగా ఒకఊళ్లో ఒక పిసినిగొట్టు ఉండేవాడు. అతడు తాను చాలా ఏండ్లనుండి కూడబెట్టుకున్న డబ్బంతా బంగారంగాచేసి దానిని ఊరిబయట గుర్తుగా ఒక గుట్టచాటున పాతిపెట్టి, రోజూ వెళ్ళి చూచుకొని ఆనందిస్తూ ఉండేవాడు.

ఇదంతా ఒక దొంగ కనిపెట్టి ఒకరాత్రి ఆ బంగారాన్ని దొంగిలించాడు. ఆమర్నాడుమామూలు ప్రకారం బంగారం వున్నదోలేదో చూచుకోడానికి వచ్చి అక్కడ బంగారం లేకపోవడంచూచి లబలబ మొత్తుకుంటూ ఇరుగు పొరుగు వారినిపిలిచి జరిగిన సంగతిఅంతాచెప్పి విచారించాడు.

అపుడా ఇరుగు పొరుగువారు "అయ్యో! పిచ్చివాడా! ఎందుకిలా విచారిస్తావు! ఆ బంగారము ఉన్నందువలన ఏమి ప్రయోజనము? నీవు దానిని ఎప్పుడూ ఉపయోగించుకోవు, ఒకరికి ఇయ్యడమూ లేదు. అటువంటప్పుడు అది పోతేమాత్రమేమి? రోజూ వచ్చి చూచుకొని సంతుష్టి పడడమేకదా నీ పని! ఇపుడు మాత్రము మించిపోయిందేమి! ఆ బంగారం బదులు, ఆస్థలంలో ఒకపెద్దబండ పాతి అదే బంగారపు ముద్దఅని తలంపుతో రోజూ వచ్చి చూచుకో" అని చెప్పారు.

పిసినిగొట్టు ముసలివాడుచేసేది లేక బంగారం కోసం ఏడుస్తూ ఇంటికిపోయాడు.

---


## "బాల" ఎడ్రసులో మార్పు:

ఇకముందు మీరు "బాల"కు రాసే వుత్తరాలు:

నెం. 3, తంబుచెట్టివీధి, మద్రాసు 1.

అని రాయండి. పాతయడ్రసుకు రాయవద్దు—మేనేజరు.

# అక్షరాల కాకి




ఇంగ్లీషు అక్షరాలతో **(A CROW)**

మన చిట్టి చిత్రకారుడు కాకి బొమ్మను రాశాడు. అలాగే, బాలా! నీవుకూడా తెలుగు అక్షరాలతో బొమ్మను రాయగలవా?




## బిటాకేఫిన్

(తలనొప్పి బిళ్లలు)

అన్ని నొప్పులను, జ్వరములను కుదుర్చును.

తలనొప్పి, పంటినొప్పి, కాళ్లనొప్పి, నిద్రలేకుండుట, కీళ్ళనొప్పులు, మలేరియా, స్త్రీల బహిష్టు నొప్పులు, అలసట వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును. వాడుకొను విధము పొట్లములో నుండును.

పొట్లం 3 బిళ్లలు **1** అణా.

స్టాకిస్టులు : దాదా అండ్ కంపెనీ, పి. టి., మద్రాసు.

అన్నిచోట్ల దొరకును.

తయారుచేయువారు :

*Stockists:*—M/S DADHA & CO, P. T. MADRAS.

*Manufactured by*—**BOMBAY TABLET MANUFACTURING CO., Post Box No. 2092, BOMBAY. 2.**




రచన: వట్టికొండ విశాలాక్షి

[ఈ కథలో బాబు గొప్పవాడు; రాముడు బీదవాడు. ఇక చదవండి కథ]

"అరే రాముడు" అంటూ బిస్కత్తు చూపించాడు బాబు. రాముడు మట్టిచేతులు చొక్కాకు తుడుచుకుంటూ గబ గబా పరుగెత్తుకుపోయాడు, బాబు దగ్గరకు. బాబు బిస్కత్తులోనుంచీ కొంచెం తుంచిపెట్టాడు రాముడికి. చేతికిచ్చిందే తడవుగా రాముడు నోట్లోవేసుకున్నాడు.

"నేనీ బండిలో కూర్చుంటాగాని లాగుతావా అటూ ఇటూ?" అన్నాడు బాబు బిస్కత్తు జేబులో పెట్టుకుంటూ.

"ఆ" అని తల అటూ ఇటూ ఊపాడు రాముడు. బాబు బండిలో కూర్చున్నాడు. రాముడు బండిని అటూ ఇటూ నాలుగైదు సార్లు తిప్పాడు.

"ఇక నేను తిప్పలేను బాబు" అన్నాడు రాముడు రొప్పుకుంటూ రోసుకుంటూ.

"ఎందుకు తిప్పలేవు?" అన్నాడు బాబు నవ్వుతూ.

"నాకు అలుపొస్తుంది" అన్నాడు రాముడు గడపల్లో చతికిలపడి కళ్లు తేలేసి.

"ఎందుకు సాలొస్తుంది?" అన్నాడు బాబు.

'ఏమో' అన్నాడు రాముడు.

"ఇంకా కాస్త పెడతాగాని లాగుతావా మరి?" అన్నాడు బాబు జేబులోనుంచి బిస్కత్తు పైకితీసి.

"సాలితీర్చుకుని" అన్నాడు రాముడు.

"ఇదిగో తీసుకో" అని మళ్లా కొంచెంపెట్టి మిగతా దంతా చుట్టబెట్టి నోట్లోపెట్టుకున్నాడు బాబు.

"ఊఁ ఇకరా" అన్నాడు బాబు కాళ్లూపుకుంటూ. రాముడు లేచి మళ్ళీ రెండుసార్లు అటూ

ఘటూ తిప్పాడు బండి. ఇక తిప్ప లేక పోయాడు.

"ఇక నే నింటికి పోతా" అన్నాడు రాముడు.

"ఆ అప్పుడే పోకేం?" అన్నాడు బాబు.

"నా కాకలవుతుంది నేపోతా" అన్నాడు రాముడు బిక్క ముఖంపెట్టి.

"నా బిస్కత్తంతా కాజేసి ఇంటికి పోతావా? పోదుగాన్లే ఉండు. చీకటిపడిందాకా లాగితేనే నిన్ను పోనిచ్చేది. తెలుసా?" అన్నాడు బాబు బెదిరిస్తూ.

'నేనిక లాగలేను. నేపోతా' అంటూ కొంచెం వెనక్కు నడవటం మొదలుపెట్టాడు రాముడు.

"నాబిస్కత్తంతా తిని ఎక్కడికి పోతావ్? నాది నాకు కక్కిపో" అన్నాడు బాబు బండిలోనుంచి లేచి రాముడిచేయి పట్టుకొని.

"నీది నువ్వుతీసుకో చాతైతే" అన్నాడు రాముడు కొంచెం ధైర్యం తెచ్చుకుని.

"నాది నేను తీసుకోనా?, తీసుకుంటాలే ఉండు" అంటూ రాముడి బోడితలమీద కొట్టాడు బాబు.

"మా అమ్మతో చెపుతాలే ఉండు" అన్నాడు రాముడు కళ్లనిండా నీళ్లు తిప్పుకుని.

"చెప్పుకో, ఏం చెపితే? ఏం చేస్తుందీ మీ అమ్మ! చెప్పుకోపోయి" అంటూ బోర్లపడేటట్లు నెట్టి లోపలకు పారిపోయాడు బాబు. రాముడి ఏడ్పువిని రాముడి తల్లి రత్నమ్మ బజార్లోకి వచ్చింది. రాముడికి పెదవినుండి రక్తం కారుతూఉంది.

"ఏంట్రా అయ్యా? ఎందుకు పడ్డావురా? ఈ రకతం ఏందిరా నాయనా!" అంటూ రాముడి చెయ్యి పట్టుకుని ఇంట్లోకి తీసుకుపోయింది రత్నమ్మ.

"బాబేకొట్టి కిందపడేటట్టు నెట్టి పారిపోయాడమ్మా" అని చెప్పాడు రాముడు ఏడుస్తూనే.

"నేను చెప్పలా!— బాగ్గెమంతుల పిల్లల సావాసానికి పోవద్దని? అయితేమాత్రం ఇదేం ఇడ్డూరం? పిల్లల్ని బతకనియ్యడేం? పాడు పిల్లడు. అడుగుదాం పద మాణిక్యమ్మగారిని" అంటూ కొడుకును మాణిక్యమ్మ గారింటికి తీసుకుపోయింది రత్నమ్మ.

మాణిక్యమ్మ బాబుకి అన్నం పెడుతూఉంది. బాబు పీటమీద కూర్చుని నవ్వుతున్నాడు.

'ఇదుగో ఏంద బ్బాయి? ఇట్లైతే బాగానే ఉంటది. ఇంకే పిల్లలు బతికేటట్టులేరే నీముందు?' అన్నది రత్నమ్మ.

"ఏమిటి రత్తం?" అన్నది మాణిక్యమ్మ.

"చూడమ్మ మీ పిల్లోడు మాబుడ్డోణ్ణి ఎట్టా నెట్టా చ్చాడో" అన్నది రత్నమ్మ రాముడి నోరు చూపిస్తూ.

"నీవు చూస్తుండగానే నెట్టా డా"

"నేనుంటే అప్పుడే చెబుదును"

"ఇంకేం మరి? మాపిల్లవాడు నెట్టినట్లు గుర్తేమున్నదక్కడ?"


"రాముడే చెపుతుండాడు. యీణ్ణడగరాదూ?"

"వాడుమాత్రం నిజం చెప్తా డని నమ్మకం ఏమిటి?"

"అసలు మా ముదనష్టపాడికే బుద్ధి లేదు లేమ్మ ఎందుకు? ఏదన్నా తినేది చూపిచ్చంగనే లగెత్తుతాడు. ఎందుకు పోవాలి అసలు అటువంటి పిల్లలదగ్గరకి?"

"మావాడికి బుద్ధిఉన్నదసలు? వాళ్లనీ వీళ్లనీ దిక్కుమాలిన వాళ్లనందరినీ జేరదీసేదీ; తను తినేది కాస్తా ఎవ్వాళ్లు మాయచేస్తే వాళ్లకు అర్పితంచేసేది! పైగా ఇంటిమీదకు తగువులు తెచ్చి పెట్టుకునేది" అన్నది మాణిక్యమ్మ పైటచెరగు తిప్పి దోపుకుంటూ.

'పదరా పద. మనబోటి వాళ్లకి రోజులు గావులే ఇయ్యి. ఎందుకు నోరుమూసుకు పడుండాల్చిందే. నేను చెప్పలా ఎందుకు పోయా మరి అటువంటి సావాసానికి?' అంటూ తన పైటచెరగుతో కొడుకు నోటి వెంట వస్తున్న రక్తాన్ని తుడుస్తూ కొడుకును ఇంటికి తీసుకుపోయింది రత్నమ్మ. బాబు తల్లి ముఖం కేసి చూచి కిలకిల నవ్వాడు తన తల్లి తన వైపె నిలబడి నందుకు గర్వసూచకంగా. మాణిక్యమ్మ నవ్వుతున్న కొడుకును కౌగలించుకుని ముద్దుపెట్టుకుంది గారాబంగా. చూశావా బాలా యీ న్యాయం!




♦♦♦ రచన: బి. అచ్చమాంబ (మదరాసు) ♦♦♦

పూర్వం, పిచికలు తతిమ్మా పక్షుల్లాగే తీరిగ్గా నడిచేవట. ఇప్పుడు చిన్న చిన్న గంతులేస్తూ నడుస్తాయి. ఎందుచేతో తెలుసా?

ఒకనాడు ఒక హంస ఒయ్యారంగా నడుస్తూవుంటే ఒక పిచికచూసి, 'హంస నడక తనకొస్తే యెంచక్కా వుండేని' అని అనుకొని హంసదగ్గరకు వెళ్ళింది.


"హంసా! హంసా! నీనడక యెంత చక్కగా వుందను కున్నావు? నీనడక నేర్చుకోవాలని నాకెంతో ఆశగావుంది. నేర్పించవా?" అని అడిగింది.

సరేఅని హంస పిచిక్కి తన నడక నేర్పడం మొదలు పెట్టింది. ఎన్నిసార్లు చెప్పినా, ఎంతసేపు చెప్పినా పిచిక్కి హంస నడక రాలేదు. విసుగెత్తి హంస తనదారిని తాను పోయింది. పిచిక మళ్ళీ తన పాతనడక నడుద్దామనుకుంటే నడవలేకపోయింది! హంస నడక రాలేదు సరిగదా, తన నడకకూడా మరిచిపోయింది. అప్పటినుంచి పాపం పిచిక గంతువేయడం మొదలుపెట్టిందట.

## "బాల" ఎడ్రసు మార్పు

ఇకముందు "బాల" కు మీరు రాసే వుత్తరాలు,

3, తంబుచెట్టి వీధి, మదరాసు 1. అని వ్రాయండి.




"అవనీంద్ర"

అనగా అనగా ఒక తండ్రికి ఇద్దరు కొడుకు లున్నారు. పెద్దవాడు సిపాయిలలో జేరి దేశాంతరం వెళ్లాడు. ఆ దేశం కాని దేశంలో చాలాయేళ్లున్నాడు. అతను మళ్లా తిరిగి యింటికి వచ్చేటప్పటికీ తండ్రి చచ్చిపోయాడు. చిన్న కొడుకు పెద్దవాడై ధనికు డయాడు. హాయిగా సుఖం అనుభవిస్తున్నాడు. అతను తమ్ముడింటికి వెళ్లాడు. తమ్ముడు మేడమెట్లు దిగుతూ అన్నగారిని చూచాడు. అన్నగారు: ''నన్నెరగవూ?'' అని అడిగాడు.

తమ్ముడు వెటకారంగా తను తన అన్నగారిని యెరగనని సమాధాన మిచ్చాడు. అప్పుడు సిపాయి అయిన అన్నగారు తను యెవరో తమ్ముడికి తెలుపుకున్నాడు. అప్పటికి తెలివివచ్చిన వాడిలాగా; ''అయితే సరే నాన్న చచ్చిపోయాడు. అదుగో ఆ కొట్లో ఒక పాతపెట్టె ఉంది. అదే నీ ఆస్తి'' పొమ్మన్నాడు. ఆ మాటలు చెబుతూనే అన్న వైపు చూడకండానే తన పని మీద తను వెళ్లిపోయాడు. సరే అన్న, తమ్ముడు చూపించిన కొట్టులోకి వెళ్లి ఏమిటో ఆ పెట్టె అని కలయచూచాడు. ఆ చీకట్లో ఒకమూల, ఒక పాత ట్రంకుపెట్టె చూచాడు. అతననుకున్నాడు, ''ఈ పాడైపోయిన పెట్టెని నేనేం చేసుకోను. ఓరి దేవుడా! కనీసం దాంతో మంట చేస్తే చలైనా కాచుకోవచ్చు. అందులో ఇప్పుడు చలిగాకూడా ఉంది.'' అని ఆ పెట్టెని బుజాన వేసుకొని, తను మకాం చేసిన

చోటికి తీసుకోవెళ్లాడు. అక్కడ, దానిని ఒక గొడ్డలితో ముక్కలు ముక్కల క్రింద బ్రద్దలుకొట్టాడు. దాంట్లోంచి ఏవేవో పాత కాగితాలు ఎగిరి వచ్చినయ్. వాట్లన్నటినీ జాగ్రతచేసి, ఒక్కటొక్కటే చదివి చూచాడు. అవన్నీ, తన తండ్రికి బాకీలున్నవాళ్ళ తాలూకు ప్రామిసరీనోట్లు "ఇదీ ఒక అదృష్టమే" అనుకున్నాడు. ఎట్లాగోట్లాగు తంటాలు పడి, ప్రామిసరీ నోట్లన్నిటితో బాకీదార్ల దగ్గర డబ్బు చేసుకున్నాడు.

ఒకరోజున అతడు బజారులో పోతూంటే, ఒక అమ్మాయి దీనంగా ఏడుస్తూ ఉండటం చూచాడు. ఆ అమ్మాయిని "ఎందుకేడుస్తున్నావ"ని అడిగాడు. ఆ అమ్మాయి తన మొగుడుకి జబ్బుగా ఉందనీ, అతనికి మందు కొంటానికి డబ్బు లేదనీ, అదీ కాకుండా మొగుడు అనేకమందికి బాకీలుపడి ఉండటంవల్ల, ఖైదులోకి కూడా వెళ్ళేట్టున్నాడనీ చెప్పింది.

అతనికి జాలేసింది. "నువ్వేం భయపడకు, అతన్ని ఖైదులో పడకుండా మీసరంజామా ఏమీ అమ్ముడుపోకుండా ఉండేటట్లు నేను చూస్తాను. అతని బాకీలు నేను తీరుస్తాను. జబ్బు నయమయేటందుకు డబ్బిస్తాను. ఒకవేళ, కర్మంజాలక చచ్చిపోతే దహన సంస్కారాలన్నీ, యథావిధిగా జరుపుతాను. మరేం భయపడకు" అని చెప్పాడు. తను చెప్పినట్టుగానే చేశాడు. కాని దీంతో తనదగ్గర ఉన్న ధనం అంతా ఖర్చయిపోయింది.

"నే నిప్పుడేం చేయాలి. ఒకపూట భోజనానికి సరిపడ డబ్బు కూడా లేదు నాదగ్గర. అయినా ఒకపని చేస్తాను. రాజుగారి దివాణంలోకి వెళ్ళి, బంట్రోతుగా కుదురుతాను." అని అనుకోని, బయలుదేరి వెళ్లిపోయాడు. అతని అదృష్టంకొద్దీ రాజుగారి దివాణంలో బంట్రోతు ఉద్యోగం వచ్చింది. అక్కడ రాజుగారికి నచ్చేటట్లుగా పనిచేశాడు. మంచివాడనిపించుకున్నాడు.

రాజుగారు ఇంతటి మాంచి బంట్రోతు దొరికినందుకు ఎంతో సంతోషించి బంట్రోతుకన్న పెద్ద ఉద్యోగం ఇచ్చాడు. దాంతో అతనికన్న క్రింద ఉన్నవాళ్లంతా ఎంతో ఆశ్చర్యపడ్డారు. అసూయకూడా వేసింది. "మన కళ్ళముందు వచ్చి, మన కళ్ళ ముందే, మనకన్న పెద్ద ఉద్యోగస్తుడయాడే!!" అని.

* * *

ఇది యిల్లా ఉండగా తమ్ముడు బీదవాడయాడు. అప్పుడు తనకు ఏదైనా సహాయం చేయమని బ్రతిమలాడుతూ అన్నకి ఒక ఉత్తరం వ్రాసాడు. ఇంతకూ ఈ తమ్ముని అన్న పేరు చెప్పటం మరచాను. అతడు వెంకయ్య. చాల దయగలవాడు. ఎవరైనా కష్టపడుతున్నారంటే, ఊరికే జాలిపడిపోతాడు. తమ్ముడు అలా వ్రాయంగానే రాజుగారికి దరఖాస్తు పెట్టాడు. తన తమ్ముడు చాలా బాధలో ఉన్నాడనీ ఏదైనా ఉద్యోగం ఇప్పించమనీ- తాను కోరిన ప్రకారం రాజుగారు తన తమ్ముడికి కూడా ఉద్యోగం ఇచ్చాడు. అన్న వెంకయ్య సహాయం చేసినందుకు కృతజ్ఞత చూపించకపోగా అన్న పై పదవికి అసూయపడి, అతనిని ఎలాగయినా ఆ ఉద్యోగంలోంచి వెళ్లగొట్టాలని విషపు పన్నాగాలు పన్నటం ప్రారంభించాడు. ఈ ఉద్దేశంతో, తన పన్నాగానికి బలంగా ఉండే విషయాలు చేకూర్చుకోటం ప్రారంభించాడు. ఆ సందర్భంలో అతనికి ఒకవిషయం వినవచ్చింది. ఏమంటే...రాజుగారు ఒక రాజకుమార్తెను పెళ్లాడాలని అనుకుంటున్నాడనీ, కాని ఆ రాజకుమార్తెకు రాజుగారు ముసలాడనీ, ఇష్టంలేదనీ, అందుకని ఆవిడ ఎవ్వరికీ తెలియని ఒకచోట, పెద్ద మేడ కట్టించుకొని, అక్కడ ఉంటున్నదనీ తెలిసింది. ఆ సంగతి ఆ రాజుగారికి, తన అన్న వెంకన్నకి ఆ రాజకుమార్తె, ఎక్కడ ఉన్నదీ తెలుసనీ, ఆవిడకీ అతనికి ఎప్పుడూ రాయబారాలు జరుగుతున్నయ్యనీ చెప్పాడు. వెంటనే రాజు

గారు, తీక్ష్ణమైన కోపంతో వెంకయ్యనిపిలిపించాడు. ఆ రాజకుమార్తెని ఎలాగైనాసరే, తన దగ్గిరకి తీసికోరమ్మని, లేకపోతే, తన తల ఎగిరిపోతుందనీ, ఒకటే హుకుం ఇచ్చి పంపాడు!

ఇప్పుడు వెంకయ్య పని ప్రమాదంలో పడింది. ఏంచేస్తాడూ? చేసేదేం లేక, ఒక గుఱ్ఱాన్ని తీసికొని బయలుదేరదామని గుఱ్ఱాలశాలలోకి వెళ్ళాడు. ఒక గుఱ్ఱాన్ని తీసుకొన్నాడు. దేనికైనా సాహసించుదామనే నిశ్చయంతో బయలుదేరాడు. కాని ఏదోవన వెడతాడూ? తను తీసికొన్న గుఱ్ఱం అన్నిటిలోకీ మంచిదీ. ఐనప్పటికీ, ముసల్దీ, సన్నటిదీని. "ఇది నాకేం సహాయం చేస్తుంది?" అని సంకోచించాడు. ఏం తోచలేదతనికి. ఆ స్థితిలో ఉండగా ఆ ముసలి గుఱ్ఱం ఒకమాటుగా, "భయపడకు, నన్ను తీసికోపో." అని మనుష్యులు మాట్లాడినట్లుగా చక్కగా మాట్లాడింది!! నిజంగా వెంకయ్యకి ఆశ్చర్యం వేసింది. అయినా గుఱ్ఱాన్ని ఎక్కాడు. తనకు దారిలో భోజనానికి, కొంత చల్దిఅన్నం మూట కట్టుకున్నాడు. వెళ్లి, వెళ్లి, ఒక చీమలపుట్ట దగ్గిరికి వచ్చాడు.

"నీఅన్నం ఈ చీమలకివెయ్యి. అవి తింటయ్." అని గుఱ్ఱం చెప్పింది. "ఎందుకు? మరి తింటానికి మనకో?" అన్నాడు వెంకయ్య. "నేను చెప్పినమాట విను. ఎందుకైనా మంచిది. అన్నం వాట్లకుపెట్టు." అని గుఱ్ఱం ఒకటే ఆజ్ఞ ఇచ్చింది. అందుకని వెంకయ్య ఆ అన్నం చీమలకివేసి, మళ్లా గుఱ్ఱంఎక్కి బయలుదేరాడు. కొంతదూరం వచ్చిన తరువాత, ఒకచోట, వేటకాడి వలలో ఒకపావురం చిక్కుకొని ఉండటం చూచాడు. గుఱ్ఱం "నువ్వుదిగి ఆ పావురాన్ని ఆవలలోంచి బయటికితియ్యి"అని ఆజ్ఞఇచ్చింది. వెంకయ్య "రాజుగారు మనకు చాలా కొద్దిగడువే ఇచ్చారు. ఇలా మనం మధ్యమధ్య ఆగుతే గడువు చాలదేమో!" అన్నాడు.

"అబ్బే. మరేం భయంలేదు. మంచి చెయ్యటంలో తప్పేంలేదు. ముందరదిగి ఆ పావురాన్ని విడిచెయ్యి" అంది గుఱ్ఱం.

ఆపనిచేసి మళ్లా బయలుదేరాడు వెంకయ్య. తోవలో నది అడ్డం వచ్చింది. ఆనది గట్టున బైటపడి కొట్టుకుంటున్న చేప కనిపించింది. గుఱ్ఱం "దిగి, ఆ చాపని నీళ్లల్లో పారేసి రమ్మంది." వెంకయ్య "మనకు టైం లేద న్నాడు" మళ్ళీ. "మంచి చెయ్యటానికి ఎప్పుడూ కావలసినంత టైముంటుంది. నీకేం భయంలేదు దిగ" మంది. ఆపనికూడాచేసి వెంకయ్య బయలుదేరి ఒక అడవిలోకి వచ్చాడు. అక్కడ ఒకపెద్ద కోట కనిపించింది. రాజకుమార్తె పావురాలకి గింజలు చల్లుతూ కూర్చుంది.

వెంకయ్య గుఱ్ఱం దిగాడు. గుఱ్ఱం ఒక్కసారిగా, మంచి అందమైన తెల్లటి గుఱ్ఱంగా తయారైంది! వెంకయ్య నిశ్చేష్టుడయాడు. "నువ్వు భయపడకు నేను ఇక్కడ గంతులువేస్తూ తిరుగుతూంటాను. రాజకుమార్తె నన్నుచూసి, ఎంతో సంతోషిస్తుంది. నాదగ్గిరకు వస్తుంది. నువ్వు వెంటనే ఆమెను నామీద యెక్కించి నువ్వుకూడా యెక్కు, నేను, ఇక ఒకే పరుగుతీస్తా" నంది. అనుకున్న ప్రకారం రాజకుమార్తె గుఱ్ఱాన్ని చూసింది. దాని దగ్గిరకి వెడదామని ఆవిడకి బుద్ధిపుట్టింది. పరుగు తీసుకుంటూ గుఱ్ఱండున్న చోటుకు వచ్చింది. ఛటుక్కున వెంకయ్య ఆమెనెత్తుకొని గుఱ్ఱం ఎక్కాడు. గుఱ్ఱం ఒకేలాగు తీసింది. అనుకున్న ప్రకారం జరిగింది! రాజకుమార్తె ఇదంతాచూచి, తను దేనికో దాసురాలు కాబోతున్నదని తెలిసికుంది. విచారంతో తనచేతి బంగారు కంకణాన్ని విసిరి క్రింద పారేసింది. దానిని తెచ్చి పెట్టమని వెంకయ్య నడిగింది. "ఇదంత మంచిదికాదు. మనం వెళ్లేచోట చాలాకంకణాలు వున్నాయ్." అన్నాడు. మరి కొంతదూరంలో రాజకుమార్తె తనచేతిలోని రుమాలు విసిరింది.

అది ఆగాలి జోరులో వెళ్లి, ఒక చెట్టు కొమ్మకి పట్టుకుంది. దానిని తెచ్చిపెట్టమని అడిగింది.

"అలాటివి చాలా ఉన్నయ్ మనం వెళ్ళేచోట" అని ఇదివరకు సమాధానమే ఇచ్చాడు వెంకయ్య.

వాళ్లు నది దాటుతుండగా, రాజకుమార్తె చేతి ఉంగరంతీసి నదిలో పారేసింది. దానిని వెతికి తెచ్చిపెట్టమని అడిగింది. వెంకయ్య "అలాటివి చాలా ఉంగరాలున్నయ్." అన్నాడు. మామూలుగానే.

చివరికి రాజుగారి భవనం చేరారు. రాజుగారు చాలా సంతోషించారు. తను ప్రేమించిన రాజకుమార్తె తనవద్దకు వచ్చిందని ఎంతో మురిసిపోయాడు. కాని ఆవిడ ఒకగదిలో తలుపులు బిడాయించుకొని కూర్చుంది. ఎవళ్లువెళ్లి తీయమన్నా ససేమిరా తియ్యనంది. రాజుగారు బ్రతిమిలాడగా బ్రతిమిలాడగా, నేను "దోవలో పారేసుకున్న మూడు వస్తువులూ నాకు తెచ్చియిస్తేగాని తలుపు తియ్య" నంది. వెంటనే రాజుగారు వెంకయ్యని పిలిచి, వాట్లని వెతికి తీసికోరా, లేకపోతే నీతల యెగిరిపోతుంది, అన్నాడు.

పాపం మళ్ళీ వెంకయ్య ప్రమాదంలో చిక్కుకున్నాడు. గుఱ్ఱం దగ్గరకెళ్లి గుఱ్ఱంతో చెప్పాడీ సంగతి.

"నీకేం భయంలేదు. నన్నెక్కు పద" అంది గుఱ్ఱం. వెంకయ్య ప్రయాణం సాగించాడు. ఇదివరకు వచ్చిన చీమలపుట్ట దగ్గరకే వచ్చాడు. "చీమలనడుగు. ఆ బంగారపు కడియం అవి తెచ్చియిస్తయ్." అన్నది గుఱ్ఱం. వెంకయ్య చీమల్ని వెళ్లి అడిగాడు. అనుకున్న ప్రకారం, చీమలు యిదివరకు వెంకయ్య చేసిన మేలుకి కృతజ్ఞతతో ఆ బంగారు కంకణాన్ని తీసికోవచ్చి అతని కిచ్చినయ్. "చూచావా! మంచి చేసినవాళ్లకి మళ్ళీ ఎప్పటికైనాసరే మేలుచేస్తారు." అని చెప్పింది గుఱ్ఱం. మళ్లా ఇదివరకు చెట్టు దగ్గరకి వచ్చారు. పట్టు

రుమాలు పైచిరారు కొమ్మన వ్రేలాడుతూంది.

"ఎలా వస్తుందా రుమాలు." అన్నాడు వెంకయ్య. "నువ్వు రక్షించిన అదుగో ఆ పావురా న్నడుగు. అది తెచ్చిస్తుం దన్నది గుఱ్ఱం. అత డడిగిన వెంటనే రుమాలు తెచ్చి యిచ్చింది పావురం. తిరిగి నది దగ్గరకి వచ్చారు. "మహా ప్రవాహంగా వుంది. ఇల్లాటి నదిలో ఎక్కడ పడ్డదని వెతకనూ ఆ ఉంగరం?" అని అడిగాడు వెంకయ్య చికాకు పడుతూ.

"చికాకు పడకూ! నువ్వు నీట్లో పారేసిన చేపనడుగు. అది తెచ్చి యిస్తుంది." అని చెప్పింది గుఱ్ఱం. ఆలాగే చేప ఉంగరం తెచ్చియిచ్చింది. ఎంతో సంతో షంతో వెంకయ్య ఆమూడింటినీ రాజుగారికి తెచ్చి యిచ్చాడు. రాజుగారు ఆ మూడిట్లనీ తెచ్చి, రాజకుమార్తెకి యిచ్చాడు. కాని ఆవిడ మరింకో అడ్డుచెప్పింది. "నామేడమీంచి క్రిందకి వస్తూం టే, ఆ వెంకయ్య నన్ను, బలా త్కారంగా గుఱ్ఱాన్నెక్కించాడు. వాడిని కాగే కాగే నూనెలో పారేస్తేనేకాని నేను తలుపు తెర వను." అన్నది. రాజుగారు మళ్ళీ, వెంకయ్యని పిలిచి, "నువ్వు, ఆమెని బలత్కారంగా గుఱ్ఱం ఎక్కించావు కాబట్టి, నువ్వు,ఇక ఆ కాగేకాగే నూనెలో పడి చావాలి తప్పదు" అని ఇద్దరు సేవకుల్ని పిలిచి, కాగే కాగే నూనెలో పారవేయమని హుకుం యిచ్చాడు. వెంకయ్య, భయంతో గుఱ్ఱం దగ్గిరకి పరు గెత్తాడు. గుఱ్ఱం త్వరగా ఎక్క మని సంజ్ఞచేసి, వాయువేగం మీద పరుగెత్తింది. నది దగ్గరకి తీసికోవచ్చి "దిగి, ఈ నదిలో స్నానం చెయ్యి" మంది. వెం కయ్య స్నానం చేశాడు. చేసి బైటికి వచ్చినతోటే, పచ్చగా బంగారంలాంటి రంగుతో, మంచి అందగాడై ఊరకున్నాడు వెం కయ్య!! మళ్ళా ఎక్కమంది గుఱ్ఱం. గుఱ్ఱం మళ్ళా రాజుగారి భవనం దగ్గరకి తీసుకోవచ్చింది. ఈ అందమైన వెంకయ్యనిచూసి,

మేడమీద ఉన్న రాజకుమార్తె, "ఎవరా ఈ అందగా"డనుకుంది. వెంకయ్య రాజకుమార్తె వైపు చూచాడు. నిజంగా ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఇక రాజకుమార్తెమనస్సు మళ్లింది. ముసలివాడైన రాజుగారు వెంకయ్యనిచూసి, ఆశ్చర్యపోయాడు. "వీడు ఆ కాగే కాగే నూనెలో పడంగానే అంత అందగాడయాడు కాబోలు నేనుకూడా ఆపని చేస్తానని బయల్దేరివెళ్లి ఆ కాగే కాగే నూనెలో పడ్డాడు. పడే పడటంతోటా మని చచ్చాడు. వెంకయ్య రాజకుమార్తెని పెళ్ళి చేసుకున్నాడు. వెంకయ్య గుఱ్ఱం దగ్గిరికి వచ్చి సాష్టాంగపడ్డాడు. అప్పుడు గుఱ్ఱం యిల్లా చెప్పింది.

"నేను నువ్వు సహాయంచేసిన బీదవాణ్ణి. నేను దేవుణ్ణి. బీదవాడి రూపంలో వచ్చాను. నువ్వు ఎంత దయ కలవాడివో పరీక్షచేదామని, ఆ వేషంలోవచ్చి నిన్ను సహాయం అడిగాను. పరీక్షలో నెగ్గావు. అందుకని ఇకముందు నుంచి కూడా దీనులైనవాళ్ళకి ఉపకారం చెయ్యటంలో వెనకాడకు. మీరిద్దరూ, సుఖంగా రాజ్యం ఏలండి" అని ఆశీర్వదించి గుఱ్ఱం మాయమైపోయింది!!

(మాతృక: లియోటాల్‌స్టాయ్)




# పూలబాలురు

ఈ బొమ్మలో పువ్వుల్లో దాగివున్నారు కొందరు బాలురు. వెతకండర్రా! వెతకండి. లేకపోతే పువ్వుల్లోని తేనెను త్రాగేస్తారు! జాగ్రత!

పంపినవారు: ఎ. బాలకృష్ణారావు,
(నూజివీడు)

# ★ 7 లో గమ్మత్తుంది! ★

బాలా! ఈ గమ్మత్తు చూడు. నాలుగు ఏళ్లు వరుసగావేసి (7777) వాటిని కూడుకో. కూడుకుంటే 28 వస్తుంది కదూ? ఆ 28 ని నాలుగు ఏడులలో తీసివెయ్యి. 7777-28=7749.

ఈ వచ్చిన 7749 లో మొదటి రెండు ఏడులకు మధ్య × మార్కు పెట్టి (7×7), తరువాత మిగిలిన రెండు అంకె (49) లకు ముందు = మార్కు పెట్టు. అంటే—

7×7=49 అయింది!

చూశావా యీ గమ్మత్తు!

---


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే
బాధపడుచున్నయెడల వెంటనే

పాత్రుడుగారి


## బాల సంజీవిని

యీయండి
ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.
వివరములకు:

డా॥ పిళ్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,
11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్, తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళై పిళ్ళే వీధి, తెప్పకొలం.



# బాలసేన సంఘగీతం

రచయిత: సూరిశెట్టన్నాయ్

బాలుర ముందుకు రావాలంటే,
బాలురక్షేమం కావాలంటే,
బాలప్రతాపం చూపాలంటే,
బాలసేవ కనబరచాలంటే,
బాలసేన స్థాపించాలోయ్,
బాలల సంఘం పెట్టాలోయ్॥

బాలల బాధలు పోవాలంటే,
పెద్దలమనసులు మారాలంటే,
బాలవిద్య పెంపొందాలంటే,
బాలసేన స్థాపించాలోయ్,
బాలల సంఘం పెట్టాలోయ్॥

బాలల జండా యెగరాలంటే,
బాలల రాజ్యం పొందాలంటే,
ప్రపంచమున పేరొందాలంటే,
బాలసేన స్థాపించాలోయ్,
బాలల సంఘం పెట్టాలోయ్॥

పిల్లలు వృద్ధిని పొందాలంటే,
అభిమన్యులగా కావాలంటే,
స్వతంత్రమును సాధించాలంటే,
బాలసేన స్థాపించాలోయ్,
బాలల సంఘం పెట్టాలోయ్॥

# మూగమ్మాయి

రచయిత: 'భరద్వాజ'

శైలబాల మూగమ్మాయి. తను అందరికి మల్లే మాట్లాడలేనని ఆఅమ్మాయికి తెలుసు. ఎవరైనా తనకు మాటలు రావంటేమాత్రం ఆ అమ్మాయి కుంగిపోతుంది.

అందరికి మల్లే తనూ జడవేసుకుంటుంది. తనూ చుక్కబొట్టు పెట్టుకుంటుంది. అందరూ ఆడుకుంటే తనూ ఆడుకుంటుంది. అందరూ బడికివెడితే తనూ బడికి వెడుతుంది. అయితే అందరికీ మాటలువచ్చు. తనకి ఎంత గింజుకున్నా రావు.

ఎవరన్నా 'ఏమమ్మా! మీ అమ్మాయికి మాటలు రావా' అంటే 'అబ్బే! ఏదమ్మా! అక్క, అత్త, అమ్మ అనడం వచ్చు. ఇంకా మాటలు బాగారావు. అదే యింకో కొద్దిరోజుల్లో వస్తుంది.' అని కూతురిలో లోపాన్ని, తన చేతగానితనం అనుకుంటారేమోనని మథన పడుతూ సమర్థిస్తుంది తల్లి.

శైలబాల రోజూ వీధిలో ఆకాశంకేసి చూస్తూంది. సాయంకాలం కాగానే ఎన్నో పక్షులు ఏవేవో భాషల్లో మాట్లాడుతూ పోతూ ఉంటాయి. ఒకపక్షి ఇంకో పక్షితో ఏదో చెబుతుంది. దానికి రెండోపక్షి ఒప్పుకుంటుంది. మొదటి పక్షికి మాటలువచ్చు. ఆ మాటలు రెండోపక్షికి అర్థమవుతై. అది తిరిగి బదులు పలుకుతుంది. తను అందరూ మాటాడుతుంటే అర్థం చేసికోగలదు. అయితే అందరికి మల్లే మాట్లాడలేదు. తనేం పాపం చేసిందని!

వానాకాలంలో ఆకాశంలోకి చూస్తూంటే ఢమఢమలతో ఉరుములు ఉరుముతై. ప్రాణంలేని

మేఘాలకుకూడా మాటలువచ్చు. తనకి మాత్రం రావు.

పేరంటాని కెడితే అందరూ పాటలు పాడుతుంటే తన గొంతులోకూడా ఆపాట గుడగుడమంటుంది. తను పాడబోతే మాత్రం నోటిదాకావచ్చి అట్టే ఆగిపోతుంది. తన గొంతుపిగిలి అందులోంచి తియ్యని రాగాలు సముద్రంలో అలల్లాగా అల్లాగా రాకూడదూ!

మహర్నవమి పండగలు వచ్చినై. అమ్మా, నాన్నా ముచ్చటపడి పట్టుపరికిణీ, పట్టుచొక్కా కుట్టించి తొడిగారు. అందరికిమల్లే పేరంటానికి రోజూ తనూ వెడుతూంది. అయినా ఏదో తీరని ఆవేదన ఆ అమ్మాయి కళ్లల్లో కనబడుతూంది.



ఆ రోజు సరస్వతీ పూజ. అందరికి మల్లే తనకూ మాటలు రావాలని పలుకుల తల్లిని పదేపదే ప్రార్థించింది మనస్సులోనే. తన గొంతుపిగిలి మాటలువస్తే ఎంత బావుండు ననుకొన్నది. సరస్వతి దయ చూపుతుందనుకొన్నది. గొంతెత్తి అరవబోయింది.. కాని నోటంట మాటరాలేదు. కళ్ళల్లో గిర్రున నీళ్లుతిరిగినై. ఈజన్మంతా ఇలా మాటలురాకుండానే ఉండాలేమో! లేకపోతే సరస్వతి తను కోరింది యెందుకు తీర్చదు? తను కోరింది అందరికంటే ఎక్కువైనా కాదే! అందరికుండేదే తనూ కోరింది. ఆ అందరికి ఉన్నదీ తనకు లేదుకాబట్టే కోరింది. కాని ఆ మట్టిబొమ్మకు మన శైలబాల పడే బాధ ఏం తెలుసు? క్షీరాన్నమూ, గారెలూ పెడితే నైవేద్యం మాత్రం చెల్లిస్తుంది! అయినా మాటలు వచ్చిన వాళ్లకే మాటలు ఇస్తుంది సరస్వతి. మాటలు అసలే రాని


వాళ్ళకు ఏమని యిస్తుంది?

అలాగే ఏడుస్తూంది ఆరోజల్లా శైలబాల. రాత్రి నిద్దరలో శైలబాల కలగన్నది. తన గొంతులోంచి తియ్యని రాగాలు తీగలు సాగినై. రాగాలా అవి? రసతరంగాలు! ఒకటి వెంబడి ఒకటి దొర్లుకు పోతున్నై. అబ్బో! ఎన్ని పాటలు పాడిందని! తనకు రాని మాటలంతా మాట్లాడేసింది. అమ్మో! తనకికూడా మాటలు వచ్చేసింది. అబ్బ! ఇప్పటికిగదా అందరికి మల్లే తనూ మాట్లాడ గలిగింది.

ఆ సంతోషంలో తన్ను తానే మరచిపోయింది శైలబాల. ఆ ఆనందం ఆపుకోలేక బిగ్గరగా కేకేసింది. కాని తీరా చూచే సరికల్లా అది అంతా కల! తను మళ్లీ ఇప్పుడు మాట్లాడబోయింది. కాని మాటలు రాలేదు. ఎప్పటి మల్లేనే తనకు మాటలురావు! తను మూగమ్మాయి!

అయితే యిందాక మాట్లాడిందిగదా! అది సరస్వతి వరప్రసాదం కాబోలు! అలాంటి కల మళ్ళీ మళ్ళీ రావాలని రోజూ కలలుగంటూనేఉంది శైలబాల.

## జంతు సమ్మేళనం



ఈ వింత జంతువులో ఎన్ని జంతువులభాగాలు కలిసివున్నాయో చూడు బాలా!



# పొడుపుకథలు

సంపాదన: మలపాక రామ సూర్యనారాయణమూర్తి, (వేల్పూరు)

1

పాటపాడుగాని ప్రాణంబు మఱిసున్న
మాటలాడుగాని మరయులేదు
గాలిభుక్తియయ్యె గాలించి మఱిచూడ
దీనిభావమేమి తెలుఁగు బాల ?

2

ఆకసమునఁ దిరుగు కా దండజమది
చేపవలెనుండు నీదదు చేపవలెను
చక్రములుగల్గి యదిగాదు జట్కాబండి
దీనిభావము చెప్పుము తెలుఁగు బాల ?


3

కాళ్లలేవుకాని, కలకత్త యదిపోవు
విరుగఁబడును జనము వెళ్లగానె
పండ్లగంపగాదు, బంగారమదిగాదు
దీనిభావమేమి తెలుఁగు బాల ?

4

మూడు కండ్లుగలవు ముక్కంటి యదిగాదు
చెట్టుపై నివసించు చిలుకగాదు
నీరుకల్గియుండి నిండుకుండయుఁగాదు
దీనిభావమేమి తెలుఁగు బాల ?

(జవాబులు జూన్ సంచికలో)




కానన్ ష్మిడ్ కు

వేలూరి శివరామశాస్త్రి

అనుసరణం

# ఉంగిడి జొన్న

గొల్ల రత్తమ్మ తన కొడుకును పిలిచి "నాయనా! ఆవు చిక్కిపోతూంది, పాలివ్వడం లేదు; నీవో పెరుగు పోయమని పోరు పెడతావు; ఇంత పచ్చ గరికె కోసుకురా; వానలు లేక పోయినందువల్ల గరికా గాదమూ బాగా పెరగలేదు; ఓపిక పెట్టి తిరిగి, గుప్పెడు గుప్పెడు కోసి, ఒక మోపయితే పట్రా" అని చెప్పింది.

తల్లి చెప్పినట్లే పచ్చ గరికె గాని గడిగాని బాగా పెరిగి ఉండలేదు. అతడు ఒక చోట నుంచుని కనబడినంత మేర చూచి- "ఎంత కోస్తే గుప్పెడు కాను? ఎన్ని గుప్పెళ్ళయితే మోపు కాను?" అని ఒక జొన్న చేలో పడుకుని నిద్ర పోయాడు.

పిట్టలు కూయడం మొదలు పెట్టేయి. అతడు లేచి చూచాడు. పొద్దు వాలుతూంది. గబగబా లేచి, ఎవరూ లేకుండా చూచి, ఒక మోపెడు లేత జొన్నకోసి, యింటికి పట్టుకుపోయి-"అమ్మా నీవు పచ్చగడ్డి పట్రమ్మన్నావు, దానికన్న ఈ లేతజొన్న ఎంత బాగున్నదో చూడు.

'నిగనిగలాడే మాణిక్యా లొలకబోశా' అని చెప్పిచూపుతూ ఆవుముందర పడేసి- అన్నాడు.

తల్లి లబలబలాడుతూ పరుగెత్తి ఆ జొన్న ఇవతలికిలాగి- "ఇంతవరకూ వాన పడలేదు, ఈ జొన్న తింటే ఉంగిడితగిలి యీ ఆవు చచ్చిపోతుంది, నేను పచ్చ గరికె తెమ్మంటే నీ వీ విషమెందుకు తెచ్చావ్? పైగా మెచ్చులు చెప్తావా? ఎక్కడో పడుకున్నావ్. పైగా ఇది ముచ్చు పని" అని యిల్లా అంది:—

ప్రాల్మాలి, చెప్పని పనిచేయఁజొచ్చు-
వారి మెచ్చుల పనుల్ ప్రాణాలు పుచ్చు.

★

# గుమ్మడి - వెలగ

ఒక కాపు ఒక వెలగచెట్టుకింద పడుకున్నాడు పక్కతోటలో ఒక గుమ్మిడితీగ బంగారంలాంటి గుమ్మడిపండ్లతో ధగధగా మెరిసిపోతూ కనిపించింది. అతడు దానిని చూస్తూనే- 'ఆఁ. ఆఁ. ఈ చిన్నతీగ ఇంతలేసి కాయలు కాయడమేమిటి? ఆకాశమంటుతున్న యీ వెలగచెట్టు ఇంత చిన్న కాయలు కాయడమేమిటి? మంచిది మంచిది" అని తల ఆడిస్తూ - నేనేగనుక యీ జగత్తును సృష్టిచేస్తే యీ వెలగచెట్టుచేత నూరు సేర్లుతూగే బంగారపు కాయలు కాపించనూ? అప్పుడది కన్నులు పండువుగా ఉండదూ?" అని మీసం మెలివేశాడు.

ఒకచిన్న గాలికి ఒక వెలగపండు ఊగి గభీమని వాని ముక్కుమీద పడ్డది. ముక్కులోంచి నెత్తురు ఓడింది. అప్పుడతడు-"నా తెలివిమాలినతనానికి తగినట్టే దెబ్బ తగిలింది. ఈ వెలక్కాయేగనుక గుమ్మడి పండంత ఉండినట్లయితే యీ పాటికి నాముక్కేకాక తలకూడా

చితికిపోయేది" అని అనుకున్నాడు.

సృష్టి తాఁ బ్రకటించు నెఱుకతో నొప్పు
యత్నంబు దైవ శిల్పాంకంబు చొప్పు.

★

# సోమయ్య - సూరయ్య

చాలా కాలంకిందట సోమయ్య సూరయ్య అనే వాళ్ళిద్దరు కోర్టు ఎక్కారు.

సోమయ్య జడ్జీగారిని చూచి- అయ్యా మూ డేండ్లక్రితం నేను చాలా దూరంగా వున్న వూటు కూరు ప్రయాణం పెట్టుకున్నాను. ఈ సూర్యుడూ నేను చాలా స్నేహంగా వుండేవాళ్ళం. నా వేలికి ఒక రవ్వల ఉంగరం ఉంది. అది పారేసుకుంటా నేమో నని యితనికి దాచ మని యిచ్చి వెళ్లాను. ఇప్పుడు నేను వచ్చి అడిగితే యీ సూర్యుడు నీవు నాకుంగర మిచ్చావా? అని బుకాయిస్తున్నాడు' అని మనవి చేసికొన్నాడు.

సూర్యుడు తనగుండెలమీద చేయి వేసికొని - "అయ్యా సత్యముమీద ఆన, అంతరాత్మ సాక్షిగా నాకా ఉంగర మేమిటో తెలియదు. సోమయ్య మనస్సు ఈ విషయంలో చెడివుంటుంది" అని అన్నాడు.

జడ్జీ సోమయ్యనుచూచి- "నీ వా ఉంగరం సూరయ్య కిస్తూవుంటే దగ్గర ఎవరయినా ఉన్నారా?" అని ప్రశ్న వేశాడు.

"అయ్యో! ఎవరయినావుంటే యింతవర కెందు కొస్తుందీ? ఎవరూ లేరుకాని దగ్గర ఒక మర్రిచెట్టు ఉంది. ఆ చెట్టుకిందనే నేనితనివద్ద సెలవుతీసికొన్నాను. ఇతడు నన్ను- 'చక్కగా వెళ్ళిరా' అని దీవించాడు" అని సోమయ్య చెప్పాడు.

సూరయ్య- "అ ఉంగర మెంత నిజమో ఆ చెట్టూ అంత నిజమే. నే నా ఉంగరమూ ఎరుగను ఆ చెట్టూ ఎరుగును.' అని అన్నాడు.

అప్పుడు జడ్జీగారు - "ఓ సోమయ్యా నీవుపోయి ఆ చెట్టు మండ ఒకటి విరుచుకురా, దానిని నేను చూడాలి; మరి ఓ సూరయ్యా! సోమయ్య తిరిగి వచ్చే వరకూ నీవిక్కడే ఉండు.' అని అన్నారు.

సోమయ్య మర్రిమండ పట్రా బోయాడు. కొంచెం సేపుచూచి జడ్జీగారు సూరయ్యను పిలిచి- "ఇంత సేపు కూచున్నాడేం? ఆ కిటికీ తలుపు తియ్; వస్తున్నాడేమో చూదాం'' అనిఅన్నారు.

"వా డిప్పుడు రాకేం? ఆ చెట్టిక్కడుందా? ఇంకో గంటకు వస్తే తొందరగా వచ్చినట్లు" అని సూరయ్య అన్నాడు.

అప్పుడు జడ్జీగారు - 'ఓరి జూటాకోరా! నీ విందాక ఆ చెట్టే ఎరుగ ననీ దేముడిమీద ఆన అనీ అన్నావ్, నీకా చెట్టూ తెలుసు; ఆ ఉంగర మంత కంటె తెలుసు. తెచ్చి ఇయ్." అని గద్దించారు.

సూరయ్య చచ్చినట్టు ఉంగర మిచ్చుకున్నాడు; ఒకఏడాదిపాటు కొట్లో కూచున్నాడు. జడీగారిలా అన్నారు.—

ఎప్పుడో యొక్క నాఁ డెంతకుఁ జాలు
కల్ల లాడెడువారి కర్మంబు కాలు

★

# పేము - వేము

పెద్ద తుపాను పట్టి వెలిసింది. ఇండ్లు కూలెయ్. చెట్లు విరిగెయ్, అంతా అల్లకల్లోలమై పోయింది.

తోట ఏమపోయిందో చూచి వద్దామని ఆంజనేయులు బయలుదేరాడు. కొడుకు కొండయ్య కూడా బయలుదేరాడు. వాళ్లు తోటలోకి వెళ్లిచూచారు. గందర

గోళంగా ఉంది. తోటంతా అడవి కింద మారిపోయింది.

అప్పుడు కొండయ్య—"నాన్నా! ఈ పేము పడిపోయి ఆ వేము నిలబడి ఉంటుందని అనుకున్నాను. ఇక్కడ చూస్తే ఆ వేపచెట్టే పడిపోయి ఈ ప్రేప చెట్టే నిలబడిఉన్న దేమిటి?" అని అన్నాడు.

ఆంజనేయులు—'ఈ వేప చెట్టూ ఈ పేకుచెట్టూ వంగలేవు. కాబట్టి పడి తీరతాయ్. ప్రేపచెట్టుందే అది ఎటుపడితే అటు వంగుతుంది. కాబట్టి అది తుఫానుకు వంగి, తుఫాను పోగానే మళ్లా లేచి నిలబడ గలిగింది." అని అంటూ ఈపద్యం చెప్పాడు—

గరువ మహంకృతి కలవాఁడు కూలు
వినయంబుతో నోర్చు విజ్ఞుండు ప్రాలు.

రీటా తలవెండ్రుకలను పెంచును



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతటా దొరకును. సీసా 15 అ.



RITA
HAIR TONIC

# ★ బీదబాలుర గోడు ★

[బీద బాలుర దేశనాయకులకో విజ్ఞాపన]

బీద బాలురము బాబయ్యా!
బీదల బ్రోచే దేవరయ్యా!
గంజిలేక మేం పస్తులు పడ్డాం
గుడ్డలేక మేం గోచిలుపెట్టాం
చదువులేక మేం చవటలమయ్యాం
దారిలేక మేం దరిద్రు లయ్యాం ॥ బీద ॥

ధనికుల బిడ్డల కిచ్చేడు భోగం
ధనికుల బిడ్డల కిచ్చేడు జ్ఞానం
దరిద్రులగు మాకిస్తే నా?
మాలో యెందరో రవీంద్రనాదులు
మాలో యెందరో విప్లవ వీరులు
తయారు అయి దేశానికి మేము
తగినసేవలు చేసేవారమె
తగిన శక్తిని ఇచ్చేవారమె ॥ బీద ॥

ఇప్పటికైనా దేశ భక్తులు
ఇప్పటికైనా దేశ నాయకులు
ఇప్పటి మాదగు దుస్థితి బాప
ఇప్పుడే అందరు ఐక్యముకండు
బీద బాలురము బాబయ్యా!
బీదల బ్రోచే దేవరయ్యా!

రచన: నర్రావుల వెంకట సుబ్బారావు.




సంపాదన : ఎ. పాండురంగడు (మదరాసు.)

122221 — ఈ అంకెను

11 చే భాగించు

11111

222220 — ఈ అంకెను

10 చే భాగించు

22222

299997 — ఈ అంకెను

9 చే భాగించు

33333

355552 — ఈ ఆంకెను

8 చే భాగించు

44444

388885 — ఈ అంకెను

7 చే భాగించు

55555

399996 — ఈ అంకెను

6 చే భాగించు

66666

388885 — ఈ అంకెను

5 చే భాగించు

77777

355552 — ఈ అంకెను

4 చే భాగించు

88888

299997 — ఈ అంకెను

3 చే భాగించు

99999

20000 — ఈ అంకెను

2 చే భాగించు

10000

"బాల" ఎడ్రసులో మార్పు :


ఇకముందు మీరు "బాల" కు రాసే ఉత్తరాలు :

నెం. 3, తంబుచెట్టివీధి, మద్రాసు 1.

అని రాయండి, పాతయడ్రసుకు రాయవద్దు —మేనేజరు.

# బలే కుర్రాడు


కొంటె కిష్టయ్య బలే కుర్రాడు! బడిలో లెక్కల మేష్టారు బోర్డుమీద 60 అంకె రాసి :



“ఆరుపక్కన సున్నా రాస్తే, యీ రెండు అంకెలూ ఏమవుతాయి ?” అని అడిగారు.

కిష్టయ్య తణుకుగోణుకు లేకుండా : “ఆ రెండు అంకెలూ మోటారు కారు ఔతాయిసార్!” అన్నాడు.

“ఎలాగ ?” - అని మేష్టారు



అడిగారు. ‘ఇదుగో చూడండి కావలిస్తే!’ అని కిష్టయ్య బోర్డుమీద మోటారుబొమ్మ చూపాడు!

బాలా! చూచావా గమ్మత్తు!


## తల్లీ — పిల్లా

పాపలు

ఎండుగాను

పీలగాను

ఎందుకు వుంటారు ?

తల్లులు బలంలేకుండా

జబ్బువారైతే

వారికి పుట్టిన పిల్లలు కూడా

అలాగే వుంటారు.

స్త్రీల జబ్బులకు మంచి

మందు ఏదంటే—

## లోధ్ర

ఈ పేరు అందరూ విన్నదే—


అయినా దీనిని గురించి మీ

అమ్మతో చెప్పండి.

“లోధ్ర” దొరికే చోటు :

కేసరీ కుటీరము లిమిటెడ్.

రాయపేట - మదరాసు 14.




రచన: మల్లంపల్లి సోమశేఖరశర్మ

రామ్మూర్తీ, వెంకయ్యా - ఇద్దరిదీ ఒకేఊరు. ఒకేతరగతిలో చదువుకుంటున్నారు. ఇద్దరికి ఫస్టుమార్కులు వచ్చేవి. ఇల్లాగ అయిదవ తరగతి దాకానే చదువుకున్నారు.


అయిదవ తరగతిలో వెంకయ్యకి కృష్ణయ్యతో స్నేహం కలిసింది. కృష్ణయ్య రోజూ 8 గంటలకి కాని నిద్రలోంచి లేవడు. కాలకృత్యములు సరిగ తీర్చుకోడు. వేళకుసరిగ భోజనము చేయడు. ఇటువంటి కృష్ణయ్యతో స్నేహంచేస్తే ఎవరు బాగుపడతారు చెప్పండి?

వెంకయ్య చేతులారా చెడిపోయాడు. బడిఎగగొట్టి గూటీబిళ్ళ, బచ్చాలు, చెడుగుడు ఆడడం మొదలుపెట్టాడు. జీతంకట్టమని యిచ్చిన డబ్బులతో సిగిరెట్లుకొని, కృష్ణయ్యకి మళ్లే కాల్చడం అలవాటుచేసికున్నాడు. జీతం కట్టక పోవడంవల్ల పేరుకొట్టేసారు. నెలనెల జీతం కట్టమని యిచ్చిన డబ్బును సిగరెట్లకి తగలేసేవాడు. రోజూ పుస్తకాలు తీసికొని, కృష్ణయ్యతో కలిసి, ఏ ఆటలో ఆడుకోడానికి వెళ్ళిపోయేవాడు. ఇల్లా సంవత్సరం పూర్తయింది. పరీక్షపోయింది. వెంకయ్యని చదువు మానిపించేసారు. ఎల్లకాలం చిన్నపిల్లలుగానే ఉంటారా? పెద్దవాడయినాడు. పెళ్ళిచేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు పుట్టారు. గుఱ్ఱబ్బండి తోలుకుని బ్రతుకుతున్నాడు.

ఇంక, రామ్మూర్తి ఫస్టుమార్కులతో స్కూలుఫైనలు పేసయాడు. తరువాత కాలేజీలో చదివి ఎమ్. ఎస్‌సి. బిరుదు సంపా

దించాడు. తరువాత ఇంగ్లండు వెళ్లి చదువుకొచ్చాడు. నెలకు వెయ్యిరూపాయల ఉద్యోగము వచ్చింది. ఎంత చదువుకున్నా గర్వంలేదు. చిన్నప్పటి నాలుగు, అయిదు తరగతుల్లోని విద్యార్థుల్ని కూడా మర్చిపోలేదు. చాల బుద్ధిమంతుడు, మంచివాడు అని పేరుపొందాడు.

రామ్మూర్తి సెలవు మీద యింటికి బయలుదేరాడు. రైలు దిగి గుఱ్ఱబ్బండి ఎక్కాడు. బండి తోలేవాడు ఎవరో కాదు, మన వెంకయ్య! వెంకయ్య రామ్మూర్తిని ఆనవాలు పట్టాడు. 5 వ తరగతి సంగతులన్నీ సినిమాలో చూసినట్టుగ జ్ఞాపకం వచ్చాయి. అప్పుడు ఇద్దరికీ ఫస్టు మార్కులు రావడం, తాను కృష్ణయ్యస్నేహంచేసి చెడిపోయి చివరికిల్లా బండి తోలుకు బ్రతకడం తల్చుకునేసరికి వెంకయ్యకి ఏడుపొచ్చింది. 'అయ్యో నేనుకూడ చదువుకున్నట్టయితే రామ్మూర్తితో సమానంగ దర్జాగా ఉండేవాడినిగదా! చిన్నప్పుడు, చదువుకోమంటే చదువుకోక పోయినందుకు నేనే చెడిపోయానుగాని మానాన్న అమ్మ చెడిపోలేదు కదా!' అని అనుకున్నాడు.



"వెంకయ్యా! చదువుకున్నావు కాదుగాని, లేకపోతే నాతో సమానంగా ఉండేవాడివిగదా? కృష్ణయ్యతో స్నేహంచేసి చెడిపోయావు. అయితే కృష్ణయ్య ఏం చేస్తున్నాడు?" అని రామ్మూర్తి ప్రేమతో వెంకయ్యని అడిగాడు.

"కృష్ణయ్యగాడు బీడీలు తాగడమే కాకుండా, కల్లూ సారాయిలుకూడా తాగి జబ్బుచేసి చచ్చిపోయాడు." అని వెంకయ్య సిగ్గుపడుతు చెప్పాడు.

'నీకెంతమంది పిల్లలు?' అని అడిగాడు రామ్మూర్తి.

'ఇద్దరండి.' అన్నాడు వెంకయ్య.

'పోనీ, నువ్వు చదువుకోక పోతే చదువుకోక పోయావుగాని, నీ పిల్లలకైనా బాగా చదువు చెప్పించు, డబ్బువిషయంలో కావలస్తే నేను సహాయం చేస్తాను.' అని రామ్మూర్తి చెప్పాడు.

వెంకయ్య పిల్లలకి చదువు చెప్పించాడు. వాళ్లు చిన్నప్పట్నించి బాగా చదువుకున్నారు. రామ్మూర్తి వాళ్ళకి పెద్ద చదువులుకయ్యే డబ్బు భరించాడు. వెంకయ్య పిల్లలు చక్కని అలవాట్లు చిన్నప్పట్నించి అలవర్చుకుంటూ చక్కగ చదువుకుని గొప్పవారయినారు.

## ★ కాకి - కుక్క ★






**ఒక పక్షి — ఒక జంతువు**

**పిల్లలారా! ఈ రెండింటిలో ఏది తనయొక్క జాతిపై ఎక్కువ విశ్వాసము జూపును?**

(జవాబు: జూన్ సంచికలో)

నేరెళ్ల సూర్యనారాయణ

(కాకినాడ)




6

# లా హో రు

'లాహోరు' మన దేశపు ఉత్తర భాగానుండే గొప్ప నగరం. ఈ భాగానికే 'పంజాబ్' అని పేరు.

మొట్టమొదట ఈ నగరాన్ని కట్టించిన వాడు 'లవుడు.' ఈ లవుడు ఎవరో తెలుసునా? సీతాదేవిని పెళ్లి చేసుకున్నాడే, రాముడు, ఆయనకుమారుడు. లవుడు పెద్దవాడై యుద్ధం చేసి, శత్రువులను ఓడించి, అందరికి రాజైనాడు. రాజుకాగానే ఒక నదిఒడ్డున పెద్దపట్టణాన్ని కట్టించి, శత్రువులెవ్వరు ఆ పట్టణంలోకి రావడానికి వీలులేకుండా చుట్టు చాలా పెద్దగోడను కట్టించాడు. లవుడు కట్టించిన పట్టణం కాబట్టి దానికి 'లవహార్' అనే పేరు వచ్చింది. కొంతకాలమైనతర్వాత ఆ పేరు మారిపోయి కొత్తపేరు వచ్చింది. ఆ కొత్త పేరే 'లాహోరు.'

ఈ నగరం 'రావినది' ఒడ్డు నుంది. ఈ నగరం నిండా తోటలు, పెద్దపెద్ద చలువ రాతి మేడలు, వెడల్పైన బజార్లు వున్నాయి. లాహోరులో మొదటి నుంచి, రాజులు, రాణులు నివసించేవారు. వాళ్లు కాపురాలున్న మేడలను లాహోరులో చూడవచ్చు. అక్బరు చక్రవర్తి యీ నగరంలో పెద్దకోటను కట్టించి దానిలో మంచి మిద్దెలు మేడలు కట్టించాడు. ఆ కోటలో కెళ్లితే ఆ మేడలన్నీ చూడవచ్చు.

లాహోరులో నివసించిన రాజులందరు అందమైన పూల తోటలు చాలా వేయించారు. ఆ వూళ్లోవున్న తోటల్లోకంతటికీ అందమైనది, పెద్దది, మరొకటుంది. దీన్ని వేయించినవాడు టాజమహల్‌ను కట్టించిన షాజహాను చక్రవర్తి. ఆయనపుట్టిందీవూళ్లోనే. అందుచేత లాహోరు నగరమంటే ఆయనకు చాలా యిష్టం. ఆయన చక్రవర్తి అవడంతోటే లాహోరులో ఏదో ఒక చిన్నతోట వుంటే, చాలా రూపాయలు ఖర్చుపెట్టి చాలా చెట్లువేసి, దానిని పెంచి పెద్దదాన్నిచేశాడు.

ఆ తోటలో రకరకాలచెట్లు, రంగురంగుల పూల మొక్కలు, తామరకొలనులు, నీటికాలువలు, వాటిల్లో ఈదుతూండే బాతులు వుంటాయి. చెట్లమీద కోయిలలు, చిలకలు, గోరువంకలు, యింకా యితర పక్షులు కూతలుకూస్తూ ఎప్పుడూ అల్లరి చేస్తూంటాయి. తోటలో అక్కడక్కడ, తెల్లరాతితో కట్టిన యిండ్లుకూడా వున్నాయి. సాయంకాల మయ్యేసరికి తోటనిండా ధగధగ మెరిసే దీపాలు వెలిగిస్తారు. అప్పుడాతోట ఎంత బాగుంటుం దనుకున్నారు! ఏదో కలలో కనిపించే గమ్మత్తులాగుంటుంది. ఇవన్ని చూడటానికి ప్రతిరోజూ సాయంకాలం ఆ తోటకు చాలామంది వస్తారు. మనదేశంలో యింత చక్కటి తోట మరొకటిలేదు. ఆ తోట పేరు 'షాలిమార్ తోట.' ఒకసారివెళ్ళి దాన్ని చూచారంటే మళ్ళీ దాన్ని ఎన్నటికి మీరు మరచి పోలేరు.

మహమ్మదీయ రాజులు కట్టించిన మశీదులు, భవనాలు, ఇక్కడ లెక్కలేకుండా వున్నాయి. కాని లాహోరులో తప్పకుండా చూడవలసినవిశేషాలలో జహంగీరుగోరీ ఒకటి. 'షాదారా' అనే చోటయీ గోరీవుంది. జహంగీరు అనే రాజు చనిపోతే ఆయన భార్య నూర్జహాను ఈ గోరీని కట్టించింది. ఆమె గోరీకూడా అక్కడేవుంది. ఇది చాలా పెద్ద భవనం. తోట

మధ్యలో వుంది. దీన్నికట్టి ఎన్నో సంవత్సరాలైన ఏమాత్రం చెక్కు చెదరకుండావుంది. దానికి నాలుగు వైపులా నాలుగు ఎత్తయిన స్తంభాలున్నాయి. వాటి చివర దాకా వెళ్లితే లాహోరులోని మశీదులు, మేడలు, తోటలు, వూరి నానుకొని ప్రవహించే నది అన్ని కనిపిస్తాయి.

లాహోరుకు దగ్గరగానే పాడు పడిన దేవాలయముంది. అది లాహోరు నగరాన్ని మొదట కట్టించిన లవుని దేవాలయం.

పంజాబులోని నగరాల్లో కన్నిటికంటె ఈ నగరం పెద్దది. అంతేకాదు. పంజాబ్ ముఖ్యం పట్టణం గూడా లాహోరు నగరమే! ఈ నగరంలో చూడవలసిన విశేషాలు ఇంకా వున్నాయి.

ఇంక ఆలస్యం చెయ్యక లాహోరుకు టిక్కెట్టు పుచ్చుకోండి.

సచిత్ర

సాలు చందా: 3-8-0

విడి ప్రతి: 0-4-0

అభ్యుదయ మాస పత్రిక

స్వతంత్ర ధోరణిలో సచిత్రంగా మొదటి సంచిక

జూన్ 1 వ తేదీన వెలువడుతుంది

★

డిపాజిట్టు కట్టగలవారు ఏజన్సీ నిబంధనలకు వ్రాయండి

★

మాదిరికాపీకి నాలుగణాల స్టాంపులు పంపవలెను.

మేనేజర్: "సచిత్ర"

6, మేయర్ బాసుదేవ్ స్ట్రీట్, మద్రాసు 21.

# ★ నేను 'వేమన' చూశాను ★

బాల విలేఖరి

నేను 'వేమన' చూశానర్రా. మనం బడిలో 'విశ్వదాభిరామ-వినురవేమ' అని పద్యాలు చదువుతామే, ఆ పద్యాలు రాసిన 'వేమన' గురించే వాహినీవారు ఫిలుం తీశారు.

చిత్రం చాలా బాగుంది. అందులో అన్నిటికన్నా నాకు 'జ్యోతి' గా నటించిన చిరంజీవి కృష్ణవేణి నచ్చింది. ఎందుకంటే ఆ అమ్మాయి బలే బాగా నటించింది. ఆ జ్యోతి చిన్నాన్నే వేమన. వేమనకి జ్యోతి అంటే ఎంతో ప్రేమ. జ్యోతికి కూడా తన చిన్నాన్న వేమన అంటే ఎంతో ప్రేమ. ఎప్పుడూ వేమనతో నేసరదాగా వుంటుంది. వేమన ఎక్కడికేనా వెళ్లితే ఇంటికి తిరిగి వచ్చిందాకా జ్యోతికి తోచదు.

ఒకనాడు జ్యోతి ఇంట్లో బొమ్మలపెళ్లి చేసుకుంది. అందర్నీ పిలిచింది. అందరూ వచ్చారు. బొమ్మలపెళ్లి అయింది. ఇంక ప్రసాదాలు పంచాలి. తన చిన్నాన్న వేమన, మోహనాంగి అనే వేశ్య ఇంట్లో కూచొని యీ మాటే మరిచిపోయాడు. ఎంతకూ రాడు. పాపం, జ్యోతి అలాగ కాచుకొని కూచుంది. కొంతసేపయాక చిన్నాన్న వచ్చాడు. జ్యోతి ఎంతో సంతోషంతో రమ్మంటుంది. వేమనకి దేముళ్లంటే నమ్మకంలేదు. దేముడికి ఒకనాడేనా దండంపెట్టడు. అటువంటి వేమనని జ్యోతి, ముందుగా దేముణ్ని దండం పెడ్తేనేగాని ప్రసాదం ఇవ్వనంటుంది. జ్యోతిమీద ప్రేమచేత దేముడికి దండం పెడతాడు. నవ్వుతూ జ్యోతిని ముద్దుపెట్టుకోబోతాడు. జ్యోతి "ఆ! నన్ను ముట్టుకోకు. నేను మడి" అని దూరంగా పోతుంది. దేముడిదగ్గర లెంపలేసుకుంటేనే గాని ప్రసాదం పెదుట్ట.

ఇక్కడ జ్యోతి చాలా ముద్దుగా నటించింది.

వేమన మొదట్లో బలే పోకిరీ వాడు. ఇంట్లో డబ్బంతా తీసుకెళ్లి మోహనాంగికి ఇచ్చేసేవాడు. ఎప్పుడూ మోహనాంగి ఇంట్లోనే వుండేవాడు.

ఇటు 'జ్యోతి' మీద ప్రేమ; అటు మోహనాంగిమీద ప్రేమ. ఇలావుండగా, పాపం జ్యోతికి పెద్ద జబ్బు చేసింది. మంచంమీద, "చిన్నాన్నా! నన్ను విడిచిపెట్టి వెళ్లిపోకేం..." అని జ్యోతి అంటూవుండేది. "ఇప్పుడే వస్తానమ్మా" అని వేమన మోహనాంగి ఇంటికి వెళ్తూవుండేవాడు. ఒకనాడు జబ్బు ఎంతో ఎక్కువై పోయింది. వేమన మోహనాంగి ఇంట్లో కూచున్నాడు. ఎంతకీ రాడు. ఆలశ్యంగా వచ్చేసరికి "చిన్నాన్నా చిన్నాన్నా" అని కలవరిస్తూ తెలివి తప్పిపోయి, ఆఖరికి చనిపోయింది.

"అయ్యో! జ్యోతి చనిపోయిందే" అని వేమన చాలా విచారించాడు. అప్పుడు అతనికి వైరాగ్యం వచ్చింది. ఈ ప్రపంచం మీద విరక్తి పుట్టింది. ఇల్లూ వాకిలీ అన్నీ విడిచి వెళ్లిపోతాడు. అలాగ వెళ్లిపోయి, ఆ విరక్తితో రాసిన నీతిపద్యాలే వేమనపద్యాలు.

* * *

ఇదీ యీ చిత్రంలో జ్యోతికి సంబంధించిన కథ. ఇందులో 'వేమన' గా ఎవరు నటించారో తెలుసా? పోతనలో పోతనగాను, త్యాగయ్యలో త్యాగయ్యగాను నటించిన నాగయ్యగారే! కథలో అభిరాముడనే కంసాలి వస్తాడు. ఈ పాత్ర వేసిన లింగమూర్తిగారు కూడా బాగా నటించారు. వేమన అన్నగారు, వేమన వదిన, మోహనాంగితల్లి—అందరూ బాగానే నటించారు.

ఈ ఫిలుం వాహినీవారు తీశారు. శ్రీ కె. వి. రెడ్డిగారు బాగా డైరెక్టుచేశారు.

వేమన పద్యాలు చదివిన మనం అంతా వేమనగురించి తీసిన చిత్రం చూడవలసిందే. మీ వూరికి యీ చిత్రం వచ్చిందా? వస్తే తప్పకుండా వెళ్లిచూడండి.



# అక్కతో 5 నిమిషాలు

చిట్టిచెల్లాయిలూ!

చిట్టితమ్ముళ్లూ!

పరీక్షలయిపోయాయి. మీ కందరికీ వేసంగి సెలవు లిచ్చేశారు. మీ పరీక్ష ఫలితాలు యీ నెలతోనే చెప్తారు. చాలా మంది ప్యాసయి పై క్లాసుకి వస్తారు.

మీరు పై క్లాసుకి వెళతారని, మీ పాతక్లాసు పుస్తకాలన్నీ పనికిరావని, చించి పారేయకండేం? ఆ పుస్తకాలన్నిటికీ అట్టలు శుభ్రంగా వుంచండి. బడులు తెరిచేక, కొంతమంది పిల్లలికి, మీ పాతపుస్తకాలు కావలసి వుంటుంది. బీదపిల్లలు, పరీక్ష బాగా ప్యాసైనప్పటికీ, డబ్బు లేక, పుస్తకాలు కొనుక్కోలేక, చదువు మానవలసి వస్తుంది. అందుచేత, పాపం, అటువంటి పిల్లలికి, మీరు తప్పక సహాయం చేయాలి. మీ పాత పుస్తకాలు వారికి ఉచితంగా ఇస్తే, వాళ్లెంతో సంతోషిస్తారు. మీ విద్యకు మీ రెంతో సహాయం చేసినవారవుతారు కూడాను.

★

## బాల సంఘాలు

రైల్వే విద్యార్థి సంఘం, పలాస:

మార్చి 30 తేదిని సభ చేశాం. నూరుగురు పిల్లలు వచ్చారు. శ్రీ కామేశ్వరరావు టీచరుగారు అధ్యక్షత వహించారు. పై గ్రామాలనుంచికూడా పిల్లలు వచ్చారు. బాల సంఘాలగురించి వుపన్యాసాలు ఇచ్చారు.

ఆదవాని బాలానంద సంఘం:

ఈ సంఘం ఏప్రిలు 15 తేదీని స్థాపించారు 8 మంది సభ్యులు చేరారు. చి॥ యల్. యీరంణ్ణరావు అధ్యక్షుడు; చి. భాగీరతిబాయి, ఆర్. తారాబాయి

కార్యదర్శులు. చి॥ తమ్ముడు ఉపన్యాసం తోను చి॥ తాయమ్మాబాయి పాటల తోను సభ ముగిసింది.

సుభాస్ బోస్ బాలసంఘం,
వాల్తేరు :

ఈ సంఘం ఏప్రిల్ 15 తేదీని స్థాపించబడింది. 25 మంది సభ్యులు; 50 పుస్తకాలు వున్నవి. కార్యదర్శి ఎ. వెంకటరావుగారు. పిల్లలు అల్లరి చేయకుండా చి॥ కె. వెంకటరమణగారు చూశారు.

కాంగ్రెస్ బాలసంఘం,
రాజమండ్రి :

ఈ సంఘం జనవరిలో స్థాపించ బడింది. రాష్ట్రీయ స్వయం సేవక సంఘం వారితో కలిసి డ్రిల్లు చేయు చున్నారు. ఈ సంఘం శ్రీ దొంతంశెట్టి వీరభద్రరావు, మట్టా ఏడుకొండలరావు గార్లు నడుపుతున్నారు.

●

## కేసరీ హైస్కూలు

మైలాపూరులో వున్న కేసరీ హైస్కూలు వార్షికోత్సవం ఏప్రిల్ 19 తేదీని జరిగింది. సర్ కొంతి వెంకట రామమూర్తిగారు అధ్యక్షత వహించారు. స్కూలు ఎలా అభివృద్ధిలోనికి వచ్చిందో కార్యదర్శి నివేదిక చదివారు. బడి పిల్లలు నాటికలూ, నృత్యాలూ చేశారు. బహుమానాలు పొందారు. అంతా ఆనందం; సంతోషం.

మొగపిల్లలతో సరిసమానంగా ఆడ పిల్లలుకూడా యీ బడిలో చదువు తున్నారు. ఆడపిల్లలకు ప్రత్యేకంగా బడివుంటే బాగుండునని డాక్టరు కేసరి గారు "కేసరీకన్యా విద్యాలయము" నకు లక్ష రూపాయిలు ఛెక్కును విరాళముగ ఇచ్చారు. ఈ సందర్భంలో డాక్టరు కేసరీగారు తమ జీవితచరిత్ర అంతా చెప్పారు. వీరి జీవితచరిత్ర అందరూ చదవవలసిందే.

కస్తూరిబా మహిళా పాఠశాల
(పెద్దాపురం)

ఈ పాఠశాల స్త్రీలకు చరకా, హిందీ, గృహ పరిశ్రమలు నేర్పుటకు గాను పెట్టబడింది. శ్రీ ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, బారు సరోజినీదేవి, కె. కామేశ్వరీదేవి మున్నగువారు కార్య వర్గంలో వున్నారు. ఈ పాఠశాలలో పఠన మందిరంకూడా వుంది. ఆడపిల్ల లకు యీ పాఠశాల మిక్కిలి ఉపయోగంగా వుంటుందని తలుస్తాము.

**తెలుసా**

చంద్రగోళంలో ఒకరోజు, భూమిమీద రెండు వారాలకు సమానము.

# బాల బహుమానాలు

ప్రతీనెలా "బాల" చందాదారుల నెంబర్లు లాటరీతీసి, పదిమంది చందా దారులకు 1 రూ. చొప్పున బహుమానం పంపుతున్నాము. ఈ నెల లాటరీలో యీ దిగువ చందాదారులకు బహుమానములు వచ్చాయి. —మేనేజరు.

| | చందా నెం॥ |
|---|---|
| C. వరదరాజు, చల్లపల్లి | 631 |
| V. లీలా చిట్టిరాజు, చిల్డ్రెన్స్ గార్డెన్‌స్కూలు, మదరాసు | 4 |
| మేనేజరు, హిందూ ఎలిమెంటరీ స్కూలు, వరహాపురం అగ్రహారం | 284 |
| D. మునుస్వామి, మదరాసు | 920 |
| సెక్రెటరీ, టీచర్సు ఎసోసియేషన్ సెంటరు, మచిలీపట్నం | 576 |
| G. బాలాజి, కుప్పం | 36 |
| గుంటుపల్లి అప్పారావు, గొట్టిపాడు | 1032 |
| మేనేజరు, శ్రీ భారతి బాలికా పాఠశాల, కోరుమిల్లి | 994 |
| K. అప్పలస్వామి, సత్యవోలు | 586 |
| అంజి, ఒంగోలు | 1099 |

# బ్యాట్‌మెంటు బాల



చి॥ డి. వి. కె. యల్. దేవి,
(ఒంగోలు)

# ఏప్రిల్ 'బాల' లోని

## ప్రశ్నలకు జవాబులు

ఇది చెప్పుకో చూద్దాం?

I

అత్త పంచ
కోడలి పంచ
అత్త పంచపాళీ
పంచ అంచు
చుంచుతోక
తోకతెగిన చుంచు
నక్కతోక
నక్క బావ
బావ చొక్కా
పెళ్ళి చొక్కా
చుంచు పెళ్ళి
అత్తా కోడలు

II

ప్లవంగనామ సంవత్సరం
మార్గశిరమాసం

# పొడుపు కథలు

1. చొక్కా; 2. మామిడిపండు; 3. నిప్పు; 4. అరిటాకులు.

## చెప్పండి?

ఆ క్లాసులో ముగ్గురు పిల్లలే చదువుతున్నారు. అంచేత అందరికంటే తక్కువ మార్కులు వచ్చినవాడు క్లాసులో మూడో వాడే! చూచారా ఆ గొప్ప!

# ఆడపిల్లల బడికి లక్షరూపాయిలు



డాక్టర్. కె. యన్. కేసరిగారు

శ్రీ కేసరిగారు మదరాసులో తెలుగుపిల్లలకుగాను పెట్టిన "కేసరీ హైస్కూలు" నకు ఇదివరకే దాదాపు రెండు లక్షల రూపాయలు ఇచ్చారు. ఇప్పుడు "కేసరీ కన్యా విద్యాలయము" నకు గాను ప్రత్యేకం లక్షరూపాయలు దానంచేశారు. వీరికి మా జోతలు.



# బాల డైరి

[బాలలు డైరీ రాయడం నేర్చుకోవాలి. డైరీ రాస్తే ఎంతో ఉపయోగం. మేము ప్రతీ నెలా మదరాసులోని ఒక బాల డైరీ ప్రచురిస్తాం. చదవండి. —సం॥

## ఏప్రిల్

తేది.

1. ఇవాళ లలిత నాకు "ఏప్రిల్ ఫూల్" వుత్తరం పంపింది. నాకు చాలా కోపం వచ్చింది. టీచరుగారితో చెప్పాను. "మనమేం ఇంగ్లీషువారిమా ఏప్రిల్ ఫూల్ అవడానికి?" అన్నారు మా టీచరు.

2. ఇవాళ బస్సులో వెడుతూవుంటే ఒక కారు మా బస్సుకి అడ్డంగా వచ్చింది. బస్సుతగిలి, కారు చితికిపోయింది. కారు తప్పుదారిని వచ్చింది కాబట్టే దెబ్బలు తగిలాయి.

3. చెల్లాయి చీపురుపుల్లముక్క చెవిలో పెట్టుకుని గులిమి తీసుకుంది. పుల్ల చెవిలో గుచ్చుకొని చెవిపోటువచ్చింది. అమ్మ కోప్పడింది.

4. అమ్మ కొత్తగాజులు చేయించుకుంది. ఇవాళ పెట్టుకుంది.

5. ఇవాళ శారద పుట్టినరోజు. సాయంత్రం మేమంతా వాళ్ళింటికి టీపార్టీకి వెళ్లాం.

6. ఇవాళ రేడియోప్రోగ్రాం. రేపటినుంచీ పరీక్షలు. అయినా రేడియో స్టేషనుకి వెళ్లేను.

7. పొద్దున్నే లేచి, దేముడిని ప్రార్థించాను పరీక్షలో బాగా రాసి పాసవాలని. పరీక్ష బాగానే రాశాను.

8. లెక్కల పరీక్షలో లెక్కలు బాగానే చేశాను. మొదట భయంవేసింది గాని, అన్నీ తేలిక లెక్కలే!

9. తెలుగుపరీక్ష.

10. పరీక్షలన్నిటిలో బాగారాస్తే నాకు కొత్త కలం కొంటానని నాన్నగా రన్నారు. అన్నీ బాగానే రాశాను.

11. ఇవాళతో మా పరీక్ష లాఖరు. అబ్బ! హాయిగా వుంది.

12. ఇవాళ 'బాల' వచ్చింది! యీనెల ఇంత ఆలశ్యంగా ఎందుకొచ్చిందో! మాకు పరీక్షలని ఆలశ్యం చేసివుంటారు.

13. ఆదివారం. రేడియోప్రోగ్రాంకి సరదాగా వెళ్లాను. రేడియోలో పాటపాడాను.

14. శకుంతల సైకిలు నేర్చుకుంటూ పడిపో యింది. అమ్మ కోప్పడుతుందని, దెబ్బ తగిలినా ఏడవలేదు.

15. అబ్బ! ఇవాళ ఏమీ తోచటంలేదు. 'త్యాగయ్య' సినీమాకి వెళ్దాం అనుకుంటే అన్నయ్య ఇవాళ ఒద్దన్నాడు,

16. మా అమ్మమ్మను గురించి బాలపోటీ పరీక్షకి రాశాను. మా అమ్మమ్మతో తనమీద నేనురాశానని చెబితే నవ్వింది.

17. శారద, కమల అందరం బీచికి వెళ్లాం. సరదాగా ఇసుకలో ఆడుకున్నాం.

18. మామయ్య గులాబీపువ్వులు బుట్టతో బుట్టెడు పంపేడు. పువ్వులుపెట్టి జడ వేసుకున్నాం.

19. ఈ రోజున మా బడి వార్షికోత్సవం జరిగింది. చాలామంది వచ్చారు. మేం నాటకాలు వేశాం. డాక్టరు కేసరిగారు లక్షరూపాయిలు ఆడపిల్లలబడి కోసం విరాళం ఇచ్చారు. మా అదృష్టం!

20. రేడియోప్రోగ్రాంకి వెళ్లేను. 'విసనకర్ర' మీద గమ్మత్తు నాటిక వేశాం. తాతయ్య కూడా వచ్చాడు.

21. మే అందరం కలిసి అంబత్తూరు సర దాగా వెళ్లాం. చెన్నపట్నంకి 10 మైళ్ల దూరంలోవుంది. రైలులో వెళ్ళివచ్చాం.

22. ఇవాళ సుభద్ర చీపురుపుల్లతోటీ దారం తోటీ ఒక అల్లట్టప్పయ్యబొమ్మ తయారు చేసింది. బలే తమాషాగా వుంది. నేను కూడా అది నేర్చుకున్నాను.

23. ఇవాళ నేను టెలిఫోనులో మాట్లాడేను. ఎవరు కనిపెట్టేరోగాని, టెలిఫోను చాలా మంచి వుపయోగమే.

24. "బాల" కి ఒక కథ రాసి పంపించాను.

25. మా ఇంట్లో నూతిలో బాల్చీ పడిపో యింది. మా అన్నయ్య పొరుగింటి నుంచి గాలం తెచ్చివేస్తే, ఆ తాడుకూడా తెగి, గాలంకూడా నూతిలో పడిపో యింది! ఎలాగ? మా అన్నయ్య అప్పుడు ఒక పెద్ద వెదురుకర్రతెచ్చి, దానికొనకి ఒక మేకుకొట్టి నూతిలో అడుక్కి ఆ కర్రని దింపి ఇటూ అటూ తిప్పేడు. ఆ మేకుకి గాలంతాడు తగులు కొని గాలం పైకివచ్చింది. ఆ గాలానికి బాల్చీతాడు తగిలి బాల్చీకూడా పైకి వచ్చే సింది! చాల గమ్మత్తుగావుంది.

26. లలిత రేపటినుంచీ నాకు అల్లికపని నేర్పుతానంది. సాయంత్రం షాపుకెళ్లి వూలు, అల్లికపుల్లలు కొనితెచ్చాను.

27. ఇవాళ రేడియోకి ఊటీనుంచి, కోలారు నుంచీ కొత్తమెంబర్లు వచ్చారు. రేడి యోలో వైశాఖపూజపార్టీ చేసుకున్నాం.

28. ఈ ఎండల్లో ఏమీ తోచడంలేదు. ఇంట్లో చింతపిక్కలు ఆడుకున్నాం. లలిత అల్లిక నేర్పింది.

29. బాలన్నయ్య ఇవాళ ఒక లాటరీలో ఒక అణా వేస్తే కేరళసబ్బు వచ్చింది. నేను కూడా అణా వేశానుగాని నాకేమీరాలేదు. ఆశకొద్దీ అందరూ అణాలువేశారు కాని అందరికీ పోవడమే!

30. సాయంత్రం మెయిలులో అక్కా బావతో కలిసి నేను వాళ్లవూరికి బయలుదేరాను.



# బాలపోటీ—
# —గెలిచినవారు

★

[ఏప్రిల్ నెల బాల పోటీపరీక్షలోకూడా చాలా మంది రచనలు పంపారు. చాలా బాగున్నాయి. ఈ దిగువవారు పంపిన రచనలు అన్నిటికంటే బాగున్నాయి కాబట్టి వారికి బహుమతులు పంపబడును—పోటీ సం॥]

మొదటి బహుమానం (రూ. 10/-)

**చి॥ పిరాట్ల అచ్యుత రాధాకృష్ణ (కాకినాడ)**

రెండవ బహుమానం (రూ. 6/-)

**చి॥ అవసరాల రామకృష్ణారావు (తుని)**

మూడవ బహుమానం (రూ. 4/-)

**చి॥ కె. రమణమ్మ (కాకినాడ)**

ఇవిగాక ఈ దిగువవారు పంపిన రచనలుకూడా బాగున్నాయి. వారికికూడా చిన్నచిన్న బహుమతులు పంపబడును.

1. చి॥ నిడదవోలు సర్వేశ్వరరావు (మదరాసు)
2. చి॥ వెదురుమూడి సుబ్బారావు (మదరాసు)
3. చి॥ సత్తిరాజు లక్ష్మీనారాయణ (మదరాసు)
4. చి॥ నిష్టల ఇందిర (చోడవరం)
5. చి॥ పిల్లలమఱ్ఱి కుమారీ మీనాక్షి (బెజవాడ)

—పోటీ సం॥

# "బాల" పోటీ పరీక్ష

మే నెల

| | | |
|---|---|---|
| మొదటి బహుమానం | రూ. | 10 |
| రెండవ బహుమానం | రూ. | 6 |
| మూడవ బహుమానం | రూ. | 4 |

పిల్లలకు గొప్ప అవకాశం! ఉత్సాహం! ఆనందం!

ఈనెల పోటీ ప్రశ్న ఇది :

## "మా ఊరు"

మీ ఊరునిగురించి ఒక చిన్నరచన, రెండు పేజీలకు మించకుండా (పావుతావు సైజులో) రాయవలెను. నీవు బాగా రాస్తే నీకు యీ పై మూడు బహుమానాలలో ఒకటి రావచ్చును.

**మీ రచనతో 4 అణాలు పంపండి**

- నాలుగణాలు మనియార్డరుగాగాని, నాలుగు అణాబిళ్లలుగాగాని పంపండి పావలా బిళ్లలు పంపవద్దు.
- ఈ పోటీలో 15 ఏళ్లకు లోపువారే చేరాలి.
- కవరుమీద "బాల పోటీ" అని పెద్ద అక్షరాలతో రాయాలి.
- మీ రచనలు మాకు మే 25 వ తేదీ లోపుగా చేరాలి.

ఈ పోటీలో 'బాల' ఎడిటర్‌గారి అభిప్రాయమే ఖాయము.

ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

పై విలాసం ఇలా రాయండి :

"బాల పోటీపరీక్ష"

c/o "బాల", 3, తంబుచెట్టి వీధి, మదరాసు 1.

# ఉగాది సంచికలు

ఆంధ్రజ్యోతి :

ఈ సంచిక చాలా బాగుంది. ఆర్టు పేపరుమీద రంగురంగుల బొమ్మలతో, మంచిమంచి కథలతో సుమారు 200 పేజీల సంచిక 1 రూ॥ వెలకి ఇచ్చారు. ఇటువంటి సంచికలు ప్రతి నెలా ఇస్తే బాగుండును. ఈ సంచిక వలయువారు 37, ఆచారప్పన్ వీధి, మద్రాసు 1 అని రాస్తే వారు పంపుతారు.

ఢంకా :

ఢంకావారి ప్రత్యేక సంచికలో ఢంకావారి ప్రత్యేకత కనిపిస్తూనేవుంది. వ్యంగ్యచిత్రాలు, రసవంతమయిన రాజకీయ విమర్శనలు, ప్రత్యేక రచనలతో విరాజిల్లుతుంది. 'ఢంకా' ఆఫీసు, 6, సుంకురామచెట్టి వీధి, మదరాసు 1 కి రాస్తే పుస్తకం పంపుతారు. వెల రూ 1-4-0.

వెలుగు :

వెలుగు ఉగాది కిరణం అందున్నాం. 70 పేజీల యీ సంచికలో సుమారు 30 ప్రత్యేక రచనలున్నాయి. 'వెలుగు' ప్రారంభించిన రెండో నెలలోనే ఇట్టి రసవంతమైన సంచికను ప్రచురించ గలిగిన "మహేశ్వర్" గట్టివారే. బరంపురం "వెలుగు" కార్యాలయానికి రాస్తే ఈ సంచిక పంపిస్తారు. వెల 12 అణాలు.

ఆయుర్వేద వైద్య నిలయం వారి

"లుకోరియా క్యూర్"

స్త్రీ గర్భాశయ సంబంధమైన సమస్త వ్యాధులను నిర్మూలించుటలో నిధియని 10 సం॥ అనుభవముచే చెప్పగలుగుచున్నాము. దీనిని సేవించిన పూర్ణారోగ్యము గలిగి వంధ్యత్వము తొలగిపోవును. అనేకమంది దీర్ఘరోగులకు వాడి గుణము పరీక్షింపబడిన ఆయుర్వేదఔషధ రాజము.

90 మాత్రల ప్యాకిట్టు రూ. 2—8—0

ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము :

అన్ని మందులషాపులలో దొరకును.

(మా చిరునామాలో మార్పును గమనించుడు)

ఆయుర్వేద వైద్యనిలయం

రామానాయుడుపేట : : మచిలీపట్టణము.



# ఇది చెప్పుకో చూద్దాం???

I


ఈ దిగువ అక్షరాలతో రెండు, మూడు మాటలు కాకుండా ఒకటే ఒక మాట చేయగలవా ?

క ట క మా ఒ టే ఒ

II


నేను గదిలోనుంచి అవతలికి రెండుకాళ్ళతో వెళ్ళి, ఆరు కాళ్ళతో వస్తాను. నువ్వు రాగలవా ?

III



ఈ అరటిపండ్లను మూడు కోతలతో పదిముక్కలు చేయగలవా ?

(జవాబులు జూన్ సంచికలో)



# ఆలిండియా రేడియో

## పిల్లల తెలుగు ప్రోగ్రాముల వివరాలు

**[211 మీటర్లు, 31.36 మీటర్లమీదా వినొచ్చు.]**

[ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2-15 నుంచి 3 వరకు]

### మే

**11-వ తేదీ ఆదివారం:**

పిలుపుపాట; ఉత్తరాల సంచీ; ఎవరుదొంగ? - నాటిక; పుట్టినరోజులు; సిద్ధార్థుడు - దేవదత్తుడు - కథానాటిక; చిక్కు-ప్రశ్న; మీ పాటలూ, కథలు, పోదామా.

**18-వ తేదీ ఆదివారం:**

పిలుపుపాట; ఉత్తరాలసంచీ; బిచ్చపిల్ల - నాటిక; పుట్టినరోజులు; తాతయ్యకథ; వానతాతయ్య రూపకం; చిక్కు-ప్రశ్న; మీరు పంపిన కథలు; పోదామా.

**25-వ తేదీ ఆదివారం:**

పిలుపుపాట; ఉత్తరాల సంచీ; సూరీ, సీతీ, వెంకీ - రూపకం; పుట్టినరోజులు; రంగులబాల-నాటిక; చిక్కు-ప్రశ్న; మీ పాటలూ కథలూ; పోదామా.

### జూన్

**1-వ తేదీ ఆదివారం:**

రారె చిన్ని పిల్లలార; ఉత్తరాల సంచి; తెనుగుజెండా; పుట్టినరోజులు; చిక్కు-ప్రశ్న; తూతూ బాకా; కథలు కబుర్లు; పోదామా.

Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras 4. Printed by B. Nagi Reddy at B. N. K. Press, 37, Acharappan St., G. T. Madras.

# "బాల"ను గురించి ★

# ★ కొన్ని మాటలు

● 'బాల' సం॥ చందా 5 రూ. మాత్రమే. ½ సం॥ చందా లేదు. వీ. పీ. పద్ధతి లేదు.

● 'బాల' అన్ని ఊళ్ళల్లో మా ఏజంట్ల వద్దను, హిగ్గిన్ బాదమ్సు రైల్వే బుక్‌స్టాల్సులోను దొరకును.

● 'బాల' చందాదారులు వారి ఉత్తరాల్లోనూ, మని యార్డరు కూపనులోనూ వారి చందా నెంబరు తప్పకుండా వ్రాయవలెను.

● 'బాల' కు పంపే రచనలు రెండు పేజీలకు మించకుండా చిన్నవిగాను, నీటుగాను ఉండవలెను.

● 'బాల' పాత కాపీలు అన్నీ లేవు. కొన్ని ప్రతులు మాత్రమే ఉన్నవి. కావలసినవారు ఈ క్రింది ఎడ్రెసునకు వ్రాయవలెను.

మేనేజరు : "బాల", 3, తంబుచెట్టివీధి, మదరాసు 1.




PRINTED AT THE B. N. K. PRESS, 37, ACHARAPPAN ST. MADRAS - 1